నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

**నేటి కందం- నేటికి అందం**

అశ్వికము పైన నిలుపుచు
విశ్వమ్మున క్రికెటు నందు ప్రియభారతికిన్
శశ్వత్కీర్తి నొసంగిన
దృశ్వుల కందించ వలయు తీరయిన నతుల్ !!

(చారిత్రాత్మక విజయాన్ని పొంది క్రికెట్టులో భారత దేశాన్ని విశ్వ విజేతగా నిలిపిన పనిమంతులందరికీ శుభాభినందనలు.)



-రాధశ్రీ
సెల్:9494481210


# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com


చమురు సెగ ఇప్పట్లో
చల్లారి దరికి రాదు
పశ్చిమాసియా యుద్ధ
పరిణామం వీడిపోదు
శాంతిపేర సైతానులు
సృష్టించిన శ్మశానం
చిగురించినా ఎప్పటికి
చెదిరిపోదు పాషాణం

చురక



-వేల్పుల నారాయణ
9440433475


హైదరాబాద్ బుధవారం 11-3-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:166 పేజీలు:6 వెల: రూ.1/-


## చమురు ధరల సమీక్ష.. విదేశాంగ శాఖ, చమురు శాఖ మంత్రులతో ప్రధాని మోదీ భేటీ



న్యూఢిల్లీ, మార్చి 10: దేశాన్ని చమురు ధరల పెంపు భయం ప్రజల్ని బెంబేలెత్తిస్తున్న వేళ కేంద్రం అప్రమత్తమైంది. ఈ మేరకు కేంద్ర చమురు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరితో పాటు, కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్‌తో ప్రధాని మోదీ సమావేశమయ్యారు. మంగళవారం ఉదయం వీరి భేటీ జరిగింది. ఇరాన్-ఇజ్రాయెల్, అమెరికా యుద్ధం, చమురు సంక్షోభం, ధరల నియంత్రణ, చమురు నిల్వలు, సరఫరా వంటి అంశాలపై వీరు చర్చించారు. ప్రధానంగా ఎల్పీజీ ధరల పెరుగుదలపై చర్చించినట్లు సమచారం.

ఈ సందర్భంగా దేశంలో చమురు ధరల నియంత్రణపై, గృహ వినియోగదారులను దృష్టిలో ఉంచుకుని ఒక వ్యూహాత్మక ప్రణాళికను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం దేశాన్ని చమురు ధరల అంశం కలవంపెడుతోంది. ఇరాన్ యుద్ధం, గల్ఫ్ దేశాలపై దాడులు, హోర్ముజ్ జలసంధి మూసివేత వంటి కారణాలతో ప్రపంచ వ్యాప్తంగా చమురు ధరలు పెరుగుతున్నాయి. ఇండియాలో కూడా పెట్రోల్, డీజీల్, ఎల్పీజీ వంటి గ్యాస్ ధరలు భారీగా పెరుగుతాయనే ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే ఎల్పీజీ ధరలు స్వల్పంగా పెరిగాయి. వాణిజ్య సిలిండర్ల వినియోగంపై ఆంక్షలు మొదలయ్యాయి. డిమాండ్‌కు సరిపడా ఇరాన్ యుద్ధం ఇంకా కొనసాగితే ఈ ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది. దీంతో ప్రజలపై ఆర్థిక భారం పెరిగే అవకాశం ఉంది. ఇండియా తన చమురు అవసరాల కోసం ఎక్కువగా విదేశీ దిగుతులపైనే ఆధారపడుతుంది.

మనకు అవసరమైన ఎల్పీజీలో 62 శాతం దిగుమతి చేసుకుంటున్నదే. ఈ దిగుమతి అవుతున్న దాంట్లో 85 నుంచి 90 శాతం వరకు హోర్ముజ్ జలసంధి ద్వారానే వస్తుంది. అలాంటిది ఈ సంధి మూసివేయడంతో చమురు సరఫరా ఆగిపోయింది. ఫలితంగా ఆయిల్ ధరలు పెరిగే అవకాశం ఉంది. ఇండియా ప్రతి ఏటా 31.3 మిలియన్ టన్నుల ఎల్పీజీని వినియోగిస్తుంది. ఇందులో గృహావసరాల కోసమే 87 శాతం వాడితే, మిగతా 13 శాతమే వాణిజ్య పరంగా వాడుతున్నారు. ఇప్పటికే చమురు సంక్షోభం నేపథ్యంలో పలు చోట్ల ఆంక్షలు మొదలయ్యాయి. వాణిజ్య సిలిండర్లపై ఆంక్షలు విధించడంతో వీటిని ఎక్కువగా వినియోగించి హోటళ్లు, రెస్టారెంట్లు ఇబ్బంది పడుతున్నాయి. ఈ పరిస్థితిపై నిరంతరం సమీక్ష జరిపేందుకు కేంద్రం ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది.

## ఎస్ఐఆర్ ప్రక్రియలో న్యాయాధికారులను అనుమానిస్తే సహించేది లేదు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, మార్చి 10: పశ్చిమబెంగాల్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియలో న్యాయాధికారులను అనుమానించడంపై సుప్రీంకోర్టు మంగళవారంనాడు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. న్యాయ వ్యవస్థపై అనుమానాలు వద్దని, న్యాయాధికారులు ఓవర్ టైం పనిచేసి ఓటర్ల జాబితాను పరిశీలిస్తుంటే వారిపై అనుమానాలు వ్యక్తం చేయడం సరికాదని సీజేఐ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు.

జ్యుడిషియల్ అధికారులను కోర్టు నియమించడంపై ప్రశ్నలు లేవనెత్తుతూ దాఖలైన తాజా పిటిషన్లపై విచారణ సందర్భంగా సీజేఐ మండిపడ్డారు. 'న్యాయాధికారులను ప్రశ్నించే సాహసం చేయవద్దు. ఇంతకంటే వాళ్ల నుంచి ఎలాంటి త్యాగాలు మీరు కోరుకుంటున్నారు? తొలిగించిన ఓటర్లకు సంబంధించిన కేసులను పరిశీలించేందుకు న్యాయాధికారులు ఓవర్ టైమ్ పనిచేస్తున్నారు. వారిని అనుమానించే చర్యలను సహించేది లేదు' అని అన్నారు.

ఓటర్ల జాబితా నుంచి తవను తొలగించారంటూ వస్తున్న అభ్యర్థనలను పరిశీలిస్తున్న న్యాయాధికారులకు తగిన లాజిస్టిక్ సపోర్ట్ అందించాలని ఎన్నికల కమిషన్, మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. ఓటర్లను భారీగా తొలగిస్తున్నారనే ఆరోపణలపై బెంగాల్ ప్రభుత్వం, ఈసీ మధ్య జరుగుతున్న పోరును చూస్తే ఇరువర్గాల మధ్య విశ్వాస లోటు ఉందనిపిస్తోందని కూడా కోర్టు అభిప్రాయపడింది.

హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులు, మాజీ న్యాయమూర్తులతో అప్పిలేట్ ట్రిబ్యునల్స్ ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు తాజా ఆదేశాల్లో పేర్కొంది. జ్యుడిషియల్ అధికారులు నిరాకరించిన ఓటర్లు ఈ ట్రిబ్యునల్స్‌కు అప్పీల్ చేసుకోవచ్చని తెలిపింది. ట్రిబ్యునల్స్‌కు సేవలందించేందుకు అంగీకరించిన మాజీ ప్రధాన న్యాయమూర్తులు, మాజీ న్యాయమూర్తులకు గౌరవ వేతనాన్ని నిర్ణయించాలని కోల్‌కతా హైకోర్టు చీఫ్ జస్టిస్‌ను సుప్రీంకోర్టు కోరింది. ఎన్నికల కమిషన్‌తో సంప్రదించి గౌరవ వేతానాన్ని నిర్ధారించాలని, ఈసీ దానిని చెల్లిస్తుందని తెలిపింది.

## గిరిజనులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలి: డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్, మార్చి 10: రాబోయే మూడేళ్లలో శాశ్వత భవనాలు లేని అన్ని గ్రామ పంచాయతీలకు కొత్త భవనాలు నిర్మిస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఇవాళ(మంగళవారం) వివిధ శాఖల అధికారులు, మంత్రులతో డిప్యూటీ సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ అధికారులతో సమావేశమై, హాస్టళ్లు, గురుకులాల అభివృద్ధికి నిధుల మంజూరుపై సమీక్షించారు.

'తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు కలిపి నిర్మించే అవకాశాలు పరిశీలించాలి. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. అదే విధంగా అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో ఉపాధి కల్పించే కోర్సులు ప్రవేశపెట్టాలి. గ్లోబల్ సమ్మిట్‌లో ఒప్పందం కుదుర్చుకున్న కంపెనీలతో ఏటీసీ కోర్సులు ప్రారంభిస్తాము. ఏజెన్సీ ప్రాంతాల్లో ఇసుక మైనింగ్ ట్రైబల్ ఏజెన్సీల ద్వారానే జరగాలి' అని భట్టి విక్రమార్క వెల్లడించారు.

'ఐటీడీఏల సహకారంతో గిరిజనులను పారిశ్రావికవేత్తలుగా తీర్చిదిద్దాలి. తెలంగాణ పర్యాటక రంగాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలి. కవ్వాల్, శ్రీశైలం టైగర్ జోన్ల అభివృద్ధిపై ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలి. ప్రభుత్వం ఎకో టూరిజం, టెంపుల్ టూరిజం అభివృద్ధిపై చర్యలు తీసుకుంటుంది. డ్రగ్స్ మహమ్మారి నివారణకు గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. డ్రగ్స్ దుష్ప్రభావాలపై కళారూపాల ద్వారా యువతకు అవగాహన కల్పించాలి' అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు.

## సేవ్ ద గర్ల్ చైల్డ్ లోగోను ఆవిష్కరించిన ఎస్పీ శివకుమార్




హైదరాబాద్, మార్చి 10: మహిళలను, బాలికలను గౌరవించే సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందని చంచల్‌గూడ జైలు ఎస్పీ శివకుమార్ గౌడ్ అన్నారు. మహిళ దినోత్సవ వారత్సవాల్లో భాగంగా ఎర్రమంజిల్ సేవ్ ద గర్ల్ చైల్డ్ కార్యాలయంలో మహిళ పారిశుద్ధ్య కార్మికులకు సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు, యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఫౌండర్ రాజేంద్ర పల్నాటితో కలిసి శివకుమార్ గౌడ్ హజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలలో సేవ్ ద గర్ల్ చైల్డ్ సంస్థను బలోపేతం చేసే దిశగా కృషి చేస్తున్నామన్నారు.

బాలికలను, మహిళలను గౌరవించే విధానాన్ని తల్లిదండ్రులే బాధ్యతగా తీసుకొని వారి పిల్లలకు నేర్పించాలన్నారు. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడే నిందితులతో పాటు వారి తల్లిదండ్రులకు కూడా శిక్షడాలన్నారు. తమ సంస్థ నుంచి పేద విద్యార్థులకు విద్యాపరంగా సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. ఈకార్యక్రమంలో సేవ్ ద గర్ల్ చైల్డ్ మహిళా బృందం డా. స్రవంతి, గీతారెడ్డి, రాగి స్వప్న, డా. శ్రీవాణి, ప్రియాంక, రజిత, మౌనిక, సౌజన్య, సుభాషిణి, ముందడుగు ఫౌండేషన్ సభ్యులు కొన్నె దేవేందర్, కొమటి రమేష్‌బాబు, శివనాగరాజు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## మైసమ్మగూడ హాస్టల్‌లో కానిస్టేబుల్ వీరంగం.. గదుల్లోకి దూరి విద్యార్థులపై లాఠీఛార్జ్




హైదరాబాద్, మార్చి 10: హైదరాబాద్‌లోని పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న మైసమ్మగూడలో అర్ధరాత్రి ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఒక ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులు మద్యం సేవించి సెక్యూరిటీ గార్డుతో గొడవకు దిగడమే ఈ వివాదానికి దారితీసింది. అయితే ఈ సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చే క్రమంలో విద్యార్థులపై విచక్షణారహితంగా లాఠీఛార్జ్ చేశారు. హాస్టల్ గదుల్లోకి చొరబడి, విద్యార్థులపై లాఠీఛార్జ్ చేయడమే కాకుండా వారిని రాయలేని విధంగా బూతులు తిట్టాడు.

ఇక తమపై పోలీసులు అమానుషంగా ప్రవర్తించారని, కనీసం వివరణ ఇచ్చుకునే అవకాశం కూడా ఇవ్వలేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసుల దాడికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో విద్యార్థి లోకం భగ్గుమంది. శాంతిభద్రతల పరిరక్షణ కోసమే తాము జోక్యం చేసుకున్నామని, విద్యార్థుల ప్రవర్తన వల్లే బలాన్ని ప్రయోగించాల్సి వచ్చిందని పోలీసులు చెప్తున్నప్పటికీ, గదుల్లోకి దూరి కొట్టడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## మద్యం కోసం వారం రోజుల మగ శిశువును అమ్మేసిన తల్లి

మెదక్, మార్చి 10: మెదక్ జిల్లాలో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. మద్యానికి డబ్బులు లేకపోవడంతో వారం రోజుల మగ శిశువును ప్రియుడితో కలిసి విక్రయించింది కసాయి తల్లి. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. హవేలీ ఘనపూర్ మండలంలోని లింగసానిపల్లి తాండాకు చెందిన మంజుల.. మహిపాల్ అనే వ్యక్తితో గత కొన్నేళ్లుగా సహజీవనం చేస్తోంది. మంజుల ఫిబ్రవరి 10న మెదక్‌లోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో మగ శిశువుకు జన్మనిచ్చింది.

అయితే మద్యానికి బానిసైన మంజుల డబ్బులు లేకపోవడంతో తన బిడ్డను విక్రయించాలని నిర్ణయించింది. మంజుల తన ప్రియుడితో కలిసి కామారెడ్డి జిల్లాకు చెందిన ఓ దంపతులకు రూ.1.70 లక్షలకు శిశువును విక్రయించింది. మగశిశువు పుట్టిన వారం రోజులకే ఈ దారుణం జరిగింది. అయితే బాలింతకు ఇవ్వాల్సిన గుడ్లు, ఆహార పదార్థాలు తీసుకోవడానికి ఎవరూ రాకపోవడంతో అంగన్‌వాడీ టీచర్.. మంజుల ఇంటికి వెళ్లింది. శిశువు లేకపోవడాన్ని గమనించిన అంగన్‌వాడీ టీచర్.. అనుమానంతో ఐసీడీఎస్ అధికారులు, పోలీసులకు సమాచారం అందించారు.

## పరాభవ నామ సంవత్సర పంచాంగం ఆవిష్కరణ



నల్గొండ, మార్చి 10: వైదిక బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర ధూప దీప నైవేద్య వర్కింగ్ ప్రెసిడెంట్ పెన్నా మోహన్ శర్మ అధ్యక్షతన బ్రహ్మశ్రీ దివ్య జ్ఞాన సిద్ధాంతి రచించిన పరాభవ నామ సంవత్సర తెలంగాణ రాష్ట్ర పంచాంగం ను నల్లగొండ పట్టణ కేంద్రంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, నల్లగొండ నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేందర్ శర్మ, యాదగిరిగుట్ట విశ్రాంతి ప్రధాన అర్చకులు కారంపూడి నరసింహాచార్యులు, నల్లగొండ జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ కె.భాస్కర్, లక్ష్మీనారాయణ సేవా సమితి దివ్య రామన చక్రవర్తులు, రుద్రవీణ పత్రిక సంపాదకులు బాలసుబ్రమణ్యం, అర్చక ఉద్యోగ జేఏసీ నాయకులు డివిఆర్ శర్మ, ధూప దీప నైవేద్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండోజు నవీన్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.తెలంగాణ వార్తలు

ఈ సందర్భంగా మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అర్చక సంక్షేమానికి, దేవాలయాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ పరాభవ నామ సంవత్సరంలో ఈ సమస్త మానవాళికి శ్రేయస్సు జరగాలని ఆయన ఆకాక్షించారు. నగర మేయర్ చైతన్య శ్రీనివాసరెడ్డి వ ా ట ్ల ా డ ు త ూ .. బ్రాహ్మణులందరూ తమ వేదమంత్రాలతో సమాజ హితం కోసం పూజలు చేయాలని, బ్రాహ్మణ ఆశీస్సులతో నల్లగొండ నగరాన్ని ఈ పరాభవ నామ సంవత్సరంలో అభివృద్ధి వైపు పయనింపజేస్తామన్నారు. అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేందర్ శర్మ మాట్లాడుతూ.. ధూప దీప నైవేద్య అర్చకులకు సమన్యాయం జరగాలని అర్చక ఉద్యోగ జేఏసీ కృషి చేస్తుందన్నారు. వారి వేతన సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళానని వారు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ధూప దీప నైవేద్య "స్కీం" అనే పదాన్ని తొలగించి పూర్తిస్థాయిలో దేవాదాయ శాఖ పరిధిలో తీసుకురావడం వల్ల డీడీఎన్ అర్చకులకు పే స్కేల్స్ రావడానికి అవకాశం ఉంటుందని తెలిపారు.

## అప్పుల బాధతో చేనేత కార్మికుడు ఆత్మహత్య

నల్గొండ, మార్చి 10: అప్పుల బాధతో చేనేత కార్మిరుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన రామన్నపేట మండలంలోని వెల్లంకి గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెల్లంకి గ్రామానికి చెందిన మిర్యాల బాలరాజు (39) చేనేత పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడికి భార్య అంజలి, ఒక కుమారుడు, ఓ కుమార్తె ఉన్నారు. చేనేత పని కోసం ఐదేండ్ల క్రితం భువనగిరిలోని ఫయ్ స్టార్ ఫైనాన్స్ కంపెనీలో రూ.3.50 లక్షలు అప్పు తీసుకున్నాడు. గత రెండు నెలలుగా చేనేత పనులు లేకపోవడంతో డబ్బులు లేక ఈఎంఐ కట్టలేదు. దీంతో మనస్థాపానికి గురై మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య అంజలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.




# పొగకు స్వస్తి, కొత్త జీవితానికి దోస్తీ !

## (11 మార్చి "నేషనల్ నో స్మోకింగ్ డే" సందర్భంగా)

అత్యధిక మరణాలకు కారణంగా నిలుస్తున్న పొగ తాగడమనే దులవాటు పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలనే సదుద్దేశంతో ప్రతి ఏట మార్చి మాసం 2వ బుధవారం, అనగా 11 మార్చిన "నేషనల్ నో స్మోకింగ్ డే" నిర్వహించడం ఆనవాయితీగా మారింది. ఊపిరితిత్తులకు సంబంధించిన ప్రాణాంతక వ్యాధులు, శరీరంలో ప్రాణ వాయువు మోతాదులు తగ్గడం, బిపీ/స్ట్రోక్ లాంటి హృద్రోగాలకు దారి తీస్తున్న పొగ తాగడమనే దురలవాటు బారిన పడిన మిలియన్ల ప్రజలు మరణం అంచున తమ జీవితాలను బుగ్గిపాలు చేసుకోవడం, కుటుంబాలు ఆర్థిక సమస్యలను ఎదుర్కోవడం, కుటుంబ సభ్యులు అనాథలుగా మారడం లాంటి ప్రతికూలతలు పొగరాయుళ్లను వెంటాడుతున్నాయి. పొగ తాగడాన్ని క్రమంగా తగ్గించడంతో ఫలితంగా సత్వరమే బిపీ, ఊపిరితిత్తులు, గుండె స్పందనలు మెరుగవుతాయి. పొగ మానేస్తే శరీరంలో ప్రమాదకర కార్బన్ మోనాక్సైడ్ పరిమాణం తగ్గుతూ ఆరోగ్య పునరుద్ధరణకు బాటలు పడతాయి.

నేషనల్ నో స్మోకింగ్ డే-2026 :

పొగ తాగడమనే దురలవాటు తీవ్ర ప్రభావాలను దృష్టిలో పెట్టుకొన్న ప్రపంచ పౌర సమాజం 1984 నుంచి ప్రతి ఏట 2వ బుధవారం రోజున విశ్వవ్యాప్తంగా "నేషనల్ నో స్మోకింగ్ డే" పాటించడం కొనసాగుతున్నది. పొగను వదిలితే ఆరోగ్యం మెరుగవుతుందనే నినాదాన్ని క్రిందటి స్థాయి వరకు ప్రచారం చేయడం నేటి అవసరంగా భావించాలి. ప్రత్యక్షంగా పొగ తాగడంతో పాటు పొగరాయుళ్లతో పాటు వారు వదిలే పొగను పీల్చే సెకండ్ హాండ్ స్మోకర్స్ కూడా పొగ తాగినట్లుగా, అనారోగ్యం పాలు అవుతారని భావించాలి. పొగ తాగడం ప్రాణాంతకం కావడంతో బహిరంగ ప్రదేశాల్లో స్మోకింగ్ నిషేధం విధించబడడం సముచిత నిర్ణయంగా కొనియాడాలి. పొగ తాగడంవల్ల ఊపిరితిత్తులు, నోటి క్యాన్సర్ సంభావ్యత పెరుగుతుందని పొగరాయుళ్లు గమనించాలి. పొగ తాగడం వల్ల జీర్ణనాళం, మూత్రపిండాలు, కాలేయం, యూరినరీ బ్లాడర్ లాంటి ప్రధాన అవయవాలు కూడా దెబ్బతినడం ఖాయమని తేలింది.

విజ్ఞప్తులను విందాం – నో స్మోకింగ్‌ను అమలు చేద్దాం:

2026 నేషనల్ నో స్మోకింగ్ డే ఇతివృత్తంగా "అన్‌మాస్కింగ్ ది అప్పీల్ : కౌంటరింగ్ నికోటిన్ అండ్ టొబాకో అడిక్షన్" లేదా "విజ్ఞప్తులను చేద్దాం : నికోటిన్, పొగాకు దురలవాటును వ్యతిరేకిద్దాం" అనే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతున్నది. పొగ తాగడమనే దురలవాటు వల్ల వ్యక్తి జీవితకాలం కనీసం 10 ఏండ్లు తగ్గుతుందని తేలడం ప్రమాద హెచ్చరికగా భావించాలి. స్టైల్‌గా పొగ పీల్చడం వల్ల అనారోగ్యాలు, ఆర్థిక భారం, ఆసుపత్రి బిల్లులు, సమాజంలో చెడు పేరు, కుటుంబాల్లో చీకట్లతో పాటు చివరికి అకాల మరణం లాంటివి ఉచితంగా వస్తాయని పొగరాయుళ్లు బుద్ధి తెచ్చుకోవాలి. పొగ తాగడం వల్ల చికాకు లేదా ఇర్రిటేషన్, పొగ పట్ల తీవ్రమైన కోరిక, చంచలత్వం, నిద్రలేమి లాంటి రోగ లక్షణాలు బయట పడడం, తర్వాత తీవ్రమైన ఊపిరితిత్తులు, హృద్రోగాలు, శ్వాస క్రియ రోగాలకు దారి తీస్తుంది.

"పొగకు స్వస్తి పలుకుదాం – కొత్త జీవితాలను ప్రారంభిద్దాం" అంటూ శారీరక మానసిక ఆరోగ్యాలను ఆహ్వానిస్తూ, తన కోసమే కాదు తనను నమ్మిన వారి కోసం ఆరోగ్యకర జీవనశైలిని అలవర్చుకుందాం. మన ప్రాణాలు తీయక ముందే మనమే పొగకు విడాకులిద్దాం. పొగకు లొంగకుండా మన జీవితాలను సుసంపన్నం చేసుకుందాం. పొగ దురలవాటు డబ్బుతో ముడిపడింది కాదని, కుటుంబ జీవితాలతో సంబంధాన్ని పెనవేసుకుందని తెలుసుకోవాలి. పొగను వదిలితే నీ ఆరోగ్యంతో పాటు పర్యావరణ ఆరోగ్యం కూడా దెబ్బ తింటుందని మరువరాదు. తమ బతుకులు పొగసూరక ముందే బుద్ధి తెచ్చుకొని పొగకు 'నో' చెబుదాం, ఆరోగ్యకర జీవితానికి 'ఎస్' చెబుదాం.



-ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌కు చెందిన కొచ్చి రిఫైనరీలో పాలీప్రొపైలిన్ యూనిట్‌కు ప్రధానమంత్రి శంకుస్థాపన

న్యూఢిల్లీ, మార్చి 10:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ మార్చి 11న కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 1:30 గంటలకు కేరళలోని ఎర్నాకుళంలో సుమారు రూ. 10,800 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన, జాతికి అంకితం కార్యక్రమాలు చేస్తారు. ఈ సందర్భంగా ఆయన బహిరంగ సభను ఉద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం సాయంత్రం 5:45 గంటలకు తమిళనాడులోని తిరుచిరాపల్లిలో సుమారు రూ. 5,650 కోట్ల విలువైన అభివృద్ధి పనుల ప్రారంభం, జాతికి అంకితం, శంకుస్థాపన కార్యక్రమాలు చేస్తారు. అక్కడ కూడా ప్రధానమంత్రి ప్రసంగిస్తారు.

ప్రధానమంత్రి ఎర్నాకుళం పర్యటన వివరాలు

భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) కు చెందిన కొచ్చి రిఫైనరీలో రూ. 5,500 కోట్లకు పైగా పెట్టుబడితో నిర్మించనున్న పాలీప్రొపిలీన్ యూనిట్‌కు ప్రధాని శంకుస్థాపన చేస్తారు. దీని సామర్థ్యం ఏడాదికి 400 కిలో టన్నులు. ప్యాకేజింగ్, ఆటోమొబైల్ విడిభాగాలు, వైద్య పరికరాలు, వస్త్రాలు, గృహోపకరణాల తయారీలో పాలీప్రొపైలిన్ ఎంతో కీలకం. ఇది దేశంలో పాలిమర్ తయారీ సామర్థ్యాన్ని పెంచుతుంది. దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడమే కాకుండా స్థానికంగా ఉపాధి అవకాశాలను మెరుగు పరుస్తుంది.

రహదారి మౌలిక సదుపాయాల రంగంలో రెండు ప్రధాన జాతీయ రహదారి ప్రాజెక్టులను ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. మొదటిది ఎన్‌హెచ్ 66లోని తలపాడి-చెంగళ విభాగం ఆరు వరుసల రహదారి. రూ. 2,650 కోట్లకు పైగా వ్యయంతో నిర్మించిన ఈ ప్రాజెక్టు ముంబై-కన్యాకుమారి ఎకనామిక్ కారిడార్‌లో భాగంగా ఉంది. ఇది కాసరగోడ్, కన్నూర్ జిల్లాలు, మంగళూరు, ముజపిలంగడ్ వంటి పొరుగు ప్రాంతాల మధ్య సంబంధాలను బలోపేతం చేస్తుంది. మంగళూరు, అళికల్ ఓడరేవుకు రవాణాను సులభతరం చేస్తుంది. దీనివల్ల బేకల్, పయ్యన్నూర్, కన్నూర్, కాసరగోడ్ వంటి ప్రాంతాల్లో పర్యాటకం, వాణిజ్యం మెరుగుపడతాయి.

వెంగళం నుంచి రామనాట్టుకర వరకు సుమారు రూ. 2,140 కోట్ల వ్యయంతో నిర్మించిన ఆరు వరుసల కోజికోడ్ బైపాస్ రెండో ప్రధాన ప్రాజెక్టు. ప్రస్తుతం ఉన్న అవిభక్త రెండు వరుసల రోడ్డును ఇరువైపులా సర్వీస్ రోడ్లతో కూడిన ఆరు వరుసల రహదారిగా ఆధునీకరించారు. దీని వల్ల ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గుతుంది. రహదారి భద్రత పెరుగుతుంది. ఈ మార్గంలో ప్రయాణ సమయం గంట నుంచి 15, 20 నిమిషాలకు తగ్గుతుందని భావిస్తున్నారు. కోజికోడ్ బీచ్, బేపూర్ ఓడరేవు, కప్పాడ్ బీచ్ వంటి ముఖ్యమైన ప్రాంతాలకు రవాణా సౌకర్యం మెరుగుపడి, పర్యాటకం, వాణిజ్యం వృద్ధి చెందుతాయి.

కేరళలో ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) కింద నిర్మించిన 23 గ్రామీణ రహదారులను ప్రారంభిస్తారు. ఇవి సుదూర ప్రాంతాలకు రవాణా సౌకర్యాన్ని మెరుగుపరుస్తాయి. తద్వారా మార్కెట్లు, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు పెరిగి గ్రామీణ జీవనోపాధి బలపడుతుంది.

అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద పునరాభివృద్ధి చేసిన మూడు రైల్వే స్టేషన్లను ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రారంభిస్తారు. అవి షోరనూర్ జంక్షన్, కుట్టిప్పురం, చంగనాశ్శేరి. ఈ స్టేషన్లను ప్రయాణికులకు ఆధునిక వసతులు, మెరుగైన సౌకర్యాలు కలిగించేలా ఆధునీకరించారు. స్థానిక నిర్మాణ శైలిని ప్రతిబింబిస్తూనే, ప్రయాణికులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణ అనుభవాన్ని ఇవి అందిస్తాయి.

షోరనూర్-నిలంబూర్ రోడ్డు రైల్వే లైన్ విద్యుదీకరణ ప్రాజెక్టును ప్రధానమంత్రి జాతికి అంకితం చేస్తారు. ఈ కీలక రైల్వే విభాగం విద్యుదీకరణ వల్ల షోరనూర్ వద్ద ఇంజిన్లను మార్చాల్సిన అవసరం తప్పుతుంది. దీనివల్ల రైళ్ల రాకపోకలు మరింత వేగంగా, సమర్థవంతంగా, పర్యావరణ హితంగా సాగుతాయి. పాలక్కాడ్, పొల్లాచ్చి మధ్య కొత్త రైలు సర్వీసును ప్రధాని జెండా ఊపి ప్రారంభిస్తారు. ఇది కేరళ, తమిళనాడు రాష్ట్రాల మధ్య రైలు అనుసంధానాన్ని బలోపేతం చేస్తుంది. ఈ సర్వీసు నిత్యం ప్రయాణించే వారికి, తీర్థయాత్రికులకు, వ్యాపారులకు, పర్యాటకులకు ఎంతో మేలు చేస్తుంది.

కేరళలోని కొల్లాం జిల్లా పశ్చిమ కల్లాడ వద్ద 50 మెగావాట్ల నీటిపై తేలే సౌర విద్యుత్ ప్రాజెక్టుకు ప్రధామంత్రి శ్రీ నరేంద్రమోదీ శంకుస్థాపన చేస్తారు. ఇది దేశ స్వచ్ఛ ఇంధన లక్ష్యాలకు తోడ్పడటమే కాకుండా, తక్కువ కర్బన ఉద్గారాల ఇంధన భవిష్యత్తు వైపు దేశ నిబద్ధతను చాటుతుంది.

**తిరుచిరాపల్లిలో ప్రధానమంత్రి పర్యటన**

తిరుచిరాపల్లిలో సుమారు రూ. 5,650 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించి ప్రధానమంత్రి ప్రారంభోత్సవం, శంకుస్థాపన, జాతికి అంకితం కార్యక్రమాలు చేస్తారు. ఈ ప్రాజెక్టులు పెట్రోలియం, సహజ వాయువు మౌలిక సదుపాయాలు, లూబ్రికెంట్ల తయారీ, గ్రామీణ అనుసంధానం, రహదారుల అభివృద్ధి, రైల్వే సేవల వంటి కీలక రంగాలకు సంబంధించినవి. పెట్రోలియం రంగంలో నీలగిరి, ఈరోడ్ జిల్లాల్లో రూ. 3,680 కోట్లకు పైగా పెట్టుబడితో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) చేపట్టనున్న సిటీ గ్యాస్ పంపిణీ వ్యవస్థకు ప్రాజెక్టుకు ప్రధాన మంత్రి శంకుస్థాపన చేస్తారు. దీని ద్వారా 8.8 లక్షలకు పైగా ఇళ్లకు పైపుల ద్వారా వంటగ్యాస్ కనెక్షన్లు అందుతాయి. అలాగే 200లకు పైగా వాణిజ్య సంస్థలకు గ్యాస్ సరఫరా చేయడంతో పాటు, 201 సీఎన్‌జీ స్టేషన్లను ఏర్పాటు చేస్తారు.

చెన్నైలోని మనాలి వద్ద ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీఎల్) నిర్మించిన ల్యూబ్ బ్లెండింగ్ ప్లాంట్‌ను ప్రధాన మంత్రి శ్రీ నరేంద్రమోదీ జాతికి అంకితం చేస్తారు. దీని సామర్థ్యం ఏడాదికి 672 వేల మెట్రిక్ టన్నులు. సుమారు రూ. 1,490 కోట్లతో అభివృద్ధి చేసిన ఈ ప్లాంటు, దేశీయంగా ల్యూబ్రికెంట్ల తయారీ సామర్థ్యాన్ని బలపరుస్తుంది. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన కింద తమిళనాడులో 370 కిలోమీటర్ల పొడవున నిర్మించిన 89 గ్రామీణ రోడ్లను కూడా ప్రధాన మంత్రి ప్రారంభిస్తారు. ఇది గ్రామీణ ప్రాంతాల్లో మార్కెట్లు, పాఠశాలలు, వైద్య సౌకర్యాలకు అనుసంధానాన్ని గణనీయంగా మెరుగుపరుస్తుంది. జాతీయ రహదారి 81లోని గంగైకొండ చోళపురం సమీపం లో గ్రీన్‌ఫీల్డ్ బైపాస్ నిర్మాణానికి ప్రధాన మంత్రి శంకుస్థాపన చేస్తారు. రెండు అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు, రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లు, ఒక ప్యాసింజర్ రైలు సేవలను ప్రధానమంత్రి జెండా ఊపి ప్రారంభిస్తారు. ఈ సర్వీసు లు తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక, కేరళ, తూర్పు భారతదేశంతో సహా ఇతర ప్రాంతాల మధ్య రైలు అనుసంధానాన్ని బలోపేతం చేస్తాయి. దీనివల్ల ప్రయాణీకులకు ప్రయోజనం చేకూరడమే కాకుండా ప్రాంతీయ ఆర్థిక వృద్ధికి తోడ్పడుతుంది.

# బ్రహ్మోండం.. బ్రహ్మ రథోత్సవం

## -భక్తి ఉత్సాహాలతో కదిరిలో వైభవంగా జరుగుతున్న బ్రహ్మరథోత్సవం
## -గోవింద నామస్మరణతో మారుమోగతున్న పురవీధులు

అమరావతి, మార్చి 10:పుణ్యక్షేత్రమైనకదిరి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తి, ఆధ్యాత్మిక వైభవంతో కొనసాగుతున్నాయి. ఈ మహోత్సవాల్లో అత్యంత ప్రధానమైన కార్యక్రమమైన బ్రహ్మరథోత్సవం మంగళవారం (10-03-2026) భక్తి పారవశ్యంతో, అఖండ ఆధ్యాత్మిక వాతావరణంలో అత్యంత వైభవంగా జరుగుతోంది. ఈ మహోత్సవాన్ని తిలకించేందుకు రాష్ట్ర నలుమూలలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా లక్షలాది మంది భక్తులు కదిరి పట్టణానికి తరలివచ్చారు. స్వామివారి దివ్య దర్శనం పొందేందుకు భక్తజనం ఉత్సాహంగా ఎదురుచూస్తూ కనిపించారు.

ఉదయం సుమారు 8 గంటల 45 నిమిషాలకు జరిగిన పూజా కైంకర్యాలు ముగిసిన అనంతరం బ్రహ్మరథోత్సవం ఘనంగా ప్రారంభమైంది. సంప్రదాయం ప్రకారం ముందుగా మడుగు తేరుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య పూజలు నిర్వహించగా ఆ ప్రాంతమంతా మంగళవా యిద్యాల నినాదాలతో, వేదఘోషలతో ఆధ్యాత్మిక వాతావరణంలో మునిగిపోయింది.

ఈ పూజలు ముగిసిన అనంతరం కుటాగుళ్ల ,మూర్తిపల్లి ,గజ్జలరెడ్డిపల్లి కి చెందిన వారు రథచక్రాల్ వెనుక మొద్దు వేయడంతో రథం (తేరు) కదిలింది. తెడ్లు వేయడం వల్ల తేరు సక్రమమైన మార్గంలో ప్రయాణం చేస్తుంది. భక్తులు తమ మొక్కులు తీర్చుకునేందుకు గుమ్మడికాయలను సమర్పించారు. భక్తులు ఎంతో విశ్వాసంతో, భక్తి శ్రద్ధలతో సమర్పించే ఈ మొక్కులు రథోత్సవానికి ప్రత్యేక ఆధ్యాత్మికతను అందిస్తాయి. సర్వాంగ సుందరంగా పుష్పాలతో, పతాకాలతో, పట్టు వస్త్రాలతో అద్భుత అలంకరణలతో శోభాయమానంగా అలంకరించిన మహారథంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి భక్తులకు దివ్య దర్శనమిచ్చారు.

రథం కదలిక ప్రారంభమైన వెంటనే భక్తులు ఆనందోత్సాహాలతో మిర్యాలు, దవనం చల్లి స్వామివారిపై తమ భక్తి భావాన్ని వ్యక్తం చేశారు. ఆ క్షణంలో లక్షలాది మంది భక్తులు ఒకేసారి "జయ జయ సింహ? జయ శ్రీ ఖాద్రీ లక్ష్మీ నరసింహ?" అంటూ గర్జించే నినాదాలు చేయడంతో పట్టణమంతా గోవింద నామస్మరణతో మారుమ్రోగింది. భక్తుల గోవింద నామస్మరణతో పురవీధులు ఆధ్యాత్మిక పరవశంతో నిండిపోయా యి.

సర్వాంగ సుందరమైన సమ్మోహనాకర రూపంలో శ్రీ ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి మహారథంపై విహరిస్తూ కదిరి పట్టణ తిరు వీధుల్లో భక్తులకు దర్శన భాగ్యాన్ని ప్రసాదించారు. స్వామి వారి దివ్య మంగళవిగ్రహాన్ని దర్శించేం దుకు పురవీధులన్నీ భక్తులతో నిండిపోయాయి. స్వామి వారి దివ్య దర్శనం పొందిన భక్తులు ఆనందభాష్పాలతో నమస్కరిస్తూ భక్తి పరవశంలో మునిగిపోయారు.

ఈ రథోత్సవానికి మరో ప్రత్యేక ఆకర్షణ కదిరి పట్టణ ప్రజల సేవా భావం. రథోత్సవానికి విచ్చేసే వేలాది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పట్టణ ప్రజలు స్వచ్ఛందంగా సేవలందించారు. ఉదయం నుంచే భక్తులకు అల్పాహారం, భోజనం, మజ్జిగ, శీతల పానీయాలు, బిస్కెట్లు, చాక్లెట్లు, కేకులు వంటి అనేక తిండి పదార్థాలను ఉచితంగా పంపిణీ చేశారు. భక్తులు అలసట చెందకుండా, సౌకర్యంగా స్వామివారి దర్శనం పొందేందుకు పట్టణ ప్రజలు విరామం లేకుండా సేవలందించడం ప్రత్యేకంగా నిలిచింది.

భక్తి, సేవా భావం, ఆధ్యాత్మిక ఉత్సాహం కలిసి ఈ బ్రహ్మరథోత్సవాన్ని మహోత్సవంగా మార్చాయి.

# హెచ్‌పీవీ టీకా కార్యక్రమానికి శ్రీకారం

## ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి: మంత్రి టీ,జీ భరత్



కర్నూలు మార్చి 10: ప్రభుత్వం అందిస్తున్న వైద్య సౌకర్యాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఆరోగ్యం పట్ల ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అత్యంత అవసరమని పరిశ్రమలు, వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి. భరత్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం కర్నూలు నగరంలోని ఏ?క్యాంప్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణ కోసం ఏర్పాటు చేసిన హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిలోమా వైరస్) టీకా కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు.

14 సంవత్సరాల నుంచి 15 సంవత్సరాల లోపు వయస్సు గల బాలికలకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణ కోసం ఉపయోగపడే హెచ్‌పీవీ టీకాను ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. సాధారణంగా రూ.4 వేల వరకు ఖర్చు అయ్యే ఈ టీకాను ప్రభుత్వం ఉచితంగా అందుబాటులోకి తీసుకువచ్చిందని చెప్పారు. ఈ టీకా గురించి ప్రజలకు అవగాహన కల్పించి, అర్హులైన బాలికలు తప్పనిసరిగా తీసుకునేలా చూడాలని కార్యక్రమంలో పాల్గొన్న వారిని కోరారు. అన్ని వైద్య పరీక్షలు పూర్తి చేసిన తర్వాత 96 శాతం విజయశాతం కలిగిన ఈ టీకాను కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిందని మంత్రి తెలిపారు.

గత నెల 28న దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాజస్థాన్ రాష్ట్రంలోని అజ్మీర్‌లో, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజయవాడలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారని చెప్పారు. జిల్లాలో దాదాపు 30 వేల మందికి ఈ టీకా వేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ మాట్లాడుతూ.. శరీరంలో రోగ నిరోధక శక్తి పెంపొందించుకోవడానికి అవసరమైన టీకాలు, మందులను సమయానికి తీసుకోవడం అవసరమని అన్నారు. కోవిడ్-19 సమయంలో రోగ నిరోధక శక్తి కోసం ప్రజలు టీకాలు తీసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణ కోసం తీసుకొచ్చిన ఈ టీకాను సరైన వయస్సులో బాలికలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ భాస్కర్ మాట్లాడుతూ ఈ టీకా ఒక్క డోస్ మాత్రమే వేయించుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఈ టీకాను పాఠశాలల్లో కాకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే అర్హులైన బాలికలకు ఉచితంగా వేయడం జరుగుతుందని చెప్పారు. జిల్లాలో దాదాపు 30 వేల మందికి టీకా వేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఉమ, ఆసుపత్రి సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధికి సావిత్రిబాయి పూలే చేసిన సేవలు అమోఘం

ఆదిలాబాద్, మార్చి 10:భారతదేశ తొలి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే విద్యాభివృద్ధికి చేసిన కృషి అమోఘమైందని ఊట్నూర్ మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షులు కొక్కు శంకర్, మాజీ ఉపసర్పంచ్ కొండన్ గోపాల్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు భరత్ జోగిని వ్యతిరేక పోరాట సమితి ఉమ్మడి జిల్లా కన్వీనర్ హాజమ్మ అన్నారు. మంగళవారం నారాయణపేట జిల్లా ఊట్నూర్ మండల కేంద్రం లోని అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 129వ వర్ధంతి పుదరాజ్కరించుకొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగానివాళులర్పించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న విద్యావేత్తలకు ప్రేరణ సావిత్రిబాయి పూలే భారతీయ సంఘ సంస్కర్త, ఉపాధ్యాయిని రచయిత్రిగా నిమ్న వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన జ్యోతీరావ్ పూలే భార్య కులమత భేదాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమస్వరూపిణిఅని కొనియాడారు. ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని నమ్మిన ఆమె, తన భర్తతో కలసి 1848 జనవరి 1న పూణేలో మొట్టమొదటగా బాలికల పాఠశాలను ప్రారంభించికుల వ్యవస్థకు, వ్యతిరేకంగా మహిళల సకల హక్కుల కోసం పోరాటం చేయటం చేసి తమ సామాజిక బాధ్యతగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమం లోఅంబేద్కర్ సంఘం కార్యదర్శి కొండన్ భరత్ సామాజిక కార్యకర్త నారాయణ, నరసింహులు గారు వార్డ్ మెంబర్స్ వార్డు సభ్యులు మల్లేష్ ,రూప లక్ష్మణ్,నరేష్ ఆయా సంఘాల నాయకులు చిన్న తిమ్మప్ప సహదేవ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ సీఎం జగన్‌తో ఎన్టీఆర్ జిల్లా నాయకులు భేటీ

## -తాడేపల్లిలో మర్యాదపూర్వక భేటీ
## -క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వక సమావేశం
## -జిల్లా రాజకీయ పరిస్థితులు, పార్టీ వ్యవహారాలపై చర్చ



విజయవాడ, మార్చి 10: విజయవాడ సమీపంలోని తాడేపల్లిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ఎన్టీఆర్ జిల్లా వైసీపీ అధ్యక్షుడు దేవినేని అవినాష్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా వైసీపీ నాయకులు మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయ పరిణామాలు, పార్టీ కార్యకలాపాలు జిల్లాకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.

మాజీ సీఎం జగన్ ను కలిసిన వారిలో ఎన్టీఆర్ జిల్లాకు చెందిన మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, పలువురు ఎమ్మెల్సీలు ఇతర ముఖ్య నాయకులు కూడా మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను కలిసి వివిధ విషయాలపై చర్చించారు. పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణతో పాటు నియోజకవర్గ స్థాయి సమస్యలపై కూడా ఈ సమావేశంలో అభిప్రాయాలు పంచుకున్నట్లు తెలిసింది.

# సీఐగా సుబ్రహ్మణ్యం బాధ్యతలు స్వీకరణ

ఇబ్రహీంపట్నం, మార్చి 10: ఇబ్రహీంపట్నం సర్కిల్ ఇన్ స్పెక్టర్ గా ఎ.సుబ్రహ్మణ్యం మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ సిటీ టాస్క్ ఫోర్స్ సీఐగా పనిచేస్తూ బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ ఎ.చంద్రశేఖర్ స్పెషల్ బ్రాంచి సీఐగా బదిలీ అయ్యారు.ఈ సందర్భంగా నూతన సీఐ సుబ్రహ్మణ్యంకు బదిలీపై వెళుతున్న సీఐ చంద్రశేఖర్ బాధ్యతలు అప్పగించారు. నూతన సీఐని ఎస్సైలు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# నివారణ, సమగ్ర ఆరోగ్య లక్ష్యంపై నేడు భారత్ పనిచేస్తోంది: పీఎం

న్యూఢిల్లీ, మార్చి 10:బడ్జెట్ అనంతర వెబినార్లలో భాగంగా "సబ్‌కా సాథ్ సబ్‌కా వికాస్ – ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం" అనే అంశంపై ఈ రోజు నిర్వహించిన నాలుగో వెబినార్లో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రసంగించారు. ఈ లక్ష్యాలను చేరుకోవడంలో విద్య, నైపుణ్యం, ఆరోగ్యం, పర్యాటకం, క్రీడలు, సంస్కృతి లాంటి రంగాలు ప్రధాన వాహనాలుగా పనిచేస్తాయని శ్రీ మోదీ వివరించారు. బడ్జెట్ ప్రకటనలను సమర్థంగా అమలు చేయడంపై చర్చిస్తున్న నిపుణులు, విధాన రూపకర్తలకు స్వాగతం పలికారు. "ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం ఒక అంశానికి మాత్రమే పరిమితం కాదు. అది ఈ బడ్జెట్‌లో ప్రధాన లక్ష్యం, ప్రభుత్వ సంకల్పం" అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

నివారణ, సమగ్ర ఆరోగ్య లక్ష్యాన్ని ప్రధానమంత్రి తెలియజేశారు. వేగంగా బలోపేత మవుతున్న ఆరోగ్య మౌలిక వసతులు, యోగా, ఆయుర్వేదానికి అంతర్జాతీయంగా పెరుగుతున్న ఆదరణ గురించి వివరించారు. వందలాది జిల్లాల్లో వైద్య కళాశాలలు ప్రారంభమయ్యాయని ప్రధాని చెప్పారు. ఆయుష్మాన్ భారత్ పథకం, ఆరోగ్య మందిరాల ద్వారా ఆరోగ్య సంరక్షణ సేవలు పొందే పరిధి పెరిగిందన్నారు. అభివృద్ధి చెందుతున్న 'కేర్ ఎకానమీ' గురించి ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ.. అంతర్జాతీయంగా సంరక్షణ సేవలు అందించేవారికి పెరుగుతున్న డిమాండు నేపథ్యంలో యువతకు కొత్త శిక్షణ నమూనాలు అభివృద్ధి చేయాలని నిపుణులను శ్రీ మోదీ కోరారు. "కొత్త శిక్షణ నమూనాలను అభివృద్ధి చేయడానికి, భాగస్వామ్యాలకు సూచనలివ్వాలని ఈ వెబినార్‌కు హాజరైన ఆరోగ్య రంగ ప్రతినిధులను కోరుతున్నాను. ఫలితంగా దేశంలో నైపుణ్య శిక్షణ వ్యవస్థ మరింత బలోపేతమవుతుంది" అని శ్రీ మోదీ అన్నారు.

ఆరోగ్య రంగంలో డిజిటల్ మార్పు గురించి, మారుమూల ప్రాంతాలకు కూడా చేరుకున్న టెలి-మెడిసన్ సేవల విజయాన్ని ప్రధాని చర్చించారు. ఈ వృద్ధిని అంగీకరిస్తూనే.. వినియోగ దారులకు అందించే సేవలను మరింత సరళీకరించాల్సిన, సమాజంలో మరింత అవగాహనను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. "టెలి-మెడిసిన్ సేవలను మరింత సులభతరం చేయాల్సిన, అవగాహనను పెంపొందించాల్సిన అవసరం ఉందని నేను భావిస్తున్నాను" అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

మారుతున్న భారతీయ యువత ఆలోచనా ధోరణే దేశానికి గొప్ప బలమని ప్రధాన మంత్రి ప్రశంసించారు. ఈ స్ఫూర్తిని విద్యా వ్యవస్థ అందుకోవాలని పిలుపునిచ్చారు. ఉపాధి, పరిశ్రమతో విద్యారంగాన్ని అనుసంధానించేందుకు దేశంలో నిరంతర ప్రయత్నాలు కొనసాగుతున్నాయని శ్రీ మోదీ తెలిపారు. మార్కెట్ డిమాండ్లు, వాస్తవ ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు అనుగుణంగా ఉండే, ముఖ్యంగా ఏఐ, ఆటోమేషన్, డిజిటల్ ఎకానమీ రంగాల్లో పాత్ర ప్రణాళికకు అవసరమైన పునాదిని నూతన విద్యా విధానం అందిస్తు ంది. "మన విద్యా వ్యవస్థను వాస్తవ ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో అనుసంధానించే ప్రక్రియను మనం వేగవంతం చెయ్యాలి" అని శ్రీ మోదీ చెప్పారు.

విద్య, ఉపాధి, పరిశ్రమ మధ్య సంబంధాన్ని ప్రధాన మంత్రి చర్చిస్తూ, ఏవీజీసీ (యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్) రంగానికి అందిస్తున్న ప్రోత్సాహం గురించి వివరించారు. ఆవిష్కరణ ఆధారిత ఆర్థిక వ్యవస్థ దిశగా భారత్ ప్రయాణిస్తోందని స్పష్టం చేశారు.

విద్యార్థులకు వాస్తవ ప్రపంచాన్ని పరిచయం చేసేలా తమ క్యాంపస్‌లను పారిశ్రామిక సహకారానికి, పరిశోధనాధారిత విద్యకు కేంద్రాలుగా మార్చాలని విద్యా సంస్థలకు పిలుపునిచ్చారు. "పారిశ్రామిక సహకారానికి, పరిశోధనాధారిత విద్యకు కేంద్రాలుగా క్యాంపస్‌లను అబివృద్ధి చేయడంపై కచ్చితంగా మేధోమథనం జరపాలని ఈ వెబినార్ ద్వారా మిమ్మల్ని కోరుతున్నాను" అని శ్రీ మోదీ తెలిపారు.

స్టెమ్ రంగాల్లో మహిళల సంఖ్య పెరగడం పట్ల ప్రధాన మంత్రి గర్వం వ్యక్తం చేశారు. అలాగే అత్యాధునిక సాంకేతిక రంగాల్లో మహిళలకు సమాన అవకాశాలు కల్పించడంపై ప్రభుత్వ చిత్తశుద్ధిని పునరుద్ఘాటించారు. ఎలాంటి అవరోధాలు లేకుండా ఆవిష్కరణలు, ప్రయోగాలు చేపట్టేలా యువ పరిశోధకులను ప్రోత్సహించే విస్తృతమైన పరిశోధనా రంగానికి శ్రీ మోదీ పిలుపునిచ్చారు. "ప్రయోగానికి, కొత్త ఆలోచనలపై పనిచేయడానికి పూర్తి అవకాశాన్ని పొందేలా యువ పరిశోధకులకు పరిశోధన వ్యవస్థను మనం రూపొందించాలి" అని తెలిపారు.

జాతీయ శక్తికి ఆరోగ్యవంతమైన, క్రమశిక్షణ కలిగిన యువతే వెన్నెముక అంటూ క్రీడల గురించి ప్రధానమంత్రి వివరించారు. 'ఖేలో ఇండియా' ప్రభావం గురించి వివరించారు. చిన్న పట్టణాలు, ప్రాంతాల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించడం, క్రీడా సంస్థలను వృత్తిపరమైనవిగా తయారు చేయడం, రానున్న కామన్వెల్త్ క్రీడలు, ఒలింపిక్ బిడ్ తదితర కార్యక్రమాలకు క్రీడాకారులు సన్నద్ధమయ్యేలా వారికి అందించే నిర్మాణాత్మక ఆర్థిక సహకారాన్ని పెంపొందించడం గురించి కూడా తెలియజేశారు. "ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో తక్షణమే యువ క్రీడాకారులను గుర్తించి, తీర్చిదిద్దాలి. అప్పుడే అంతర్జాతీయ పోటీల్లో భారత పతాకం రెపరెపలాడుతుంది" అని శ్రీ మోదీ తెలియజేశారు.

పర్యాటక, సంస్కృతి ఆధారిత ఉపాధి శక్తి గురించి ప్రధాన మంత్రి వివరించారు. సంప్రదాయక ప్రదేశాలను దాటి కొత్త పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేయడం ద్వారా సిటీ బ్రాండింగ్ మెరుగుపడుతుందని, సమగ్రాభివృద్ధి సాధించవచ్చని తెలిపారు. నైపుణ్యాలు, అనుసంధానం, సమాజ భాగస్వామ్యంతో కూడిన సమగ్ర విధానంపై దృష్టి సారించాలని సంబంధిత నిపుణులను శ్రీ మోదీ కోరారు. "ఇప్పుడు దేశంలో నూతన పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడంపై మేం దృష్టి సారించాం" అని ప్రధాని తెలియజేశారు.

"శిక్షణ పొందిన గైడ్లు, ఆతిథ్య నైపుణ్యాలు, డిజిటల్ అనుసంధానం, సమాజ భాగస్వామ్యమే పర్యాటక రంగానికి ప్రధాన ఆధారాలు. వీటితో పాటు పారిశుద్ధ్యం, సుస్థిర పద్ధతులను పాటించడం అవసరం. ప్రపంచ గమ్యస్థానంగా భారత్ స్థానాన్ని బలోపేతం చేయడానికి మనం సమష్టిగా కృషి చేస్తున్న నేపథ్యంలో పర్యాటకం, సంబంధిత రంగాలకు సంబంధించి మీరిచ్చే సూచనలు చాలా కీలకం" అని ప్రధానమంత్రి స్పష్టం చేశారు.

దేశ పురోగతిని వేగవంతం చేయడానికి సంస్థలు, పరిశ్రమలు, విద్యాసంస్థల మధ్య సమన్వయానికున్న ప్రాధాన్యాన్ని ప్రధానమంత్రి వివరించారు. ఈ చర్చలు భవిష్యత్తు కోసం బలమైన ప్రణాళికను అందిస్తాయని, అభివృద్ధి చెందిన భారత్ పునాదిని మరింత పటిష్టం చేస్తాయనే విశ్వాసాన్ని తన ముగింపు వ్యాఖ్యల్లో వ్యక్తం చేశారు. "ఈ ప్రయత్నాలతో అభివృద్ధి చెందిన భారత్ పునాది మరింత బలోపేతమవుతుంది'' అని పీఎం తన ప్రసంగాన్ని ముగించారు.

# తిరువూరు నియోజకవర్గ అభివృద్ధికి బాటలు..

**–అభివృద్ధికి కృషి చేస్తున్న విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ( చిన్ని)**
**–నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి రూ.8.70 కోట్ల సాస్కీ నిధులు..**
**–నిధుల మంజూరుకు ఆర్ అండ్ బి శాఖా మంత్రి బీసీ జనార్ధన రెడ్డిని కలిసి కృషి చేసిన ఎంపీ కేశినేని శివనాథ్..**
**–ఎంపీ విజ్ఞాపనకు స్పందించి నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం..**
**–తిరువూరు నియోజకవర్గం కు అత్యధిక నిధులు కేటాయింపు..**



అమరావతి, మార్చి 10:ఎన్టీఆర్ జిల్లా పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని తిరువూరు నియోజకవర్గ అభివృద్ధికి ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) బాటలు వేస్తున్నారు. గతంలో ఎన్నడూ జరగని రీతిలో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. తిరువూరు ప్రాంత అభివృద్ధిపై, ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రధానంగా నియోజకవర్గంలో దెబ్బతిన్న పలు రహదారుల అభివృద్ధిపై దృష్టి సారించిన ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సంబంధిత రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని పలుమార్లు కలిసి విజ్ఞాపనలు అందజేశారు.

గత సంవత్సరం నవంబర్ 25వ తేదీన మంత్రి బిసి జనార్ధన రెడ్డిని సచివాలయంలో కలిసిన ఎంపీ కేశినేని చిన్ని నియోజకవర్గంలో రహదారుల నిర్మాణం, అభివృద్ధి పనులపై చర్చించి వినతి పత్రాన్ని అందజేశారు. నియోజకవర్గంలో ప్రస్తుత రహదారులు, వంతెనల పరిస్థితిని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. శిథిలావస్థలో ఉన్న ప్రధాన రహదారులు, గ్రామీణ ప్రాంతాల్లో అనుసంధాన మార్గాలు, వంతెనల మరమ్మతుల అవసరాన్ని వివరించారు.

ప్రజలకు సులభ రవాణా సౌకర్యం అందించాలంటే తక్షణమే రహదారుల నిర్మాణాలు, అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయాలని కోరారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి రోడ్లు కీలకమని, త్వరితగతిన పనులు ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అప్పట్లో మంత్రిని సచివాలయంలో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. రహదారుల అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని అప్పట్లో హామీ ఇచ్చారు.

ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) కృషితో తాజాగా నియోజకవర్గంలో పలు అభివృద్ధికి ఆర్ అండ్ బి శాఖ నుంచి రూ.8.70 కోట్ల సాస్కీ నిధులను మంత్రి జనార్దన్ రెడ్డి మంజూరు చేస్తూ ప్రభుత్వపరంగా జీవో జారీ చేశారు. దెబ్బతిన్న రహదారుల అభివృద్ధికి పరిపాలనా అనుమతులు ఆర్ అండ్ బి శాఖ ద్వారా మంజూరు చేసినట్లు ఎంపీ కేసినేని శివనాద్ ( చిన్ని) సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు

ఈ మేరకు ఎం.డి.ఆర్ అండ్ ఎస్.హెచ్ ప్రపోజల్స్ అప్‌గ్రేడేషన్ల కింద, రాష్ట్ర వ్యాప్తంగా దెబ్బతిన్న రహదారుల మెరుగుదలకు సంబంధించి నిధుల విడుదల చేస్తూ ప్రభుత్వ పరంగా ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. విజయవాడ పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకవర్గాల కంటే తిరువూరు నియోజకవర్గానికి అత్యధికంగా రూ. 8.70 కోట్ల నిధులు మంజూరు అయినట్లు తెలిపారు.

**మంజూరైన పనుల వివరాలు..**

రూ.2.10 కోట్ల నిధులతో నందిగామపుట్రేల రోడ్డు, శ్రీరామ్ పురం పేరువంచ రహదారులను అభివృద్ధి చేయడం

రూ. 2.20 కోట్ల వ్యయంతో తిరువూరు' తునికిపాడు రహదారి అభివృద్ధి

రూ. 2.40 కోట్ల నిధులతో శ్రీనికేతన్కొత్తపల్లి రహదారి, కొత్తపాడు కాకర్ల రోడ్డు అభివృద్ధి

రూ. 30లక్షల వ్యయంతో కోటపాడు' కాకర్ల రోడ్డు అభివృద్ధి

రూ. 30లక్షల వ్యయంతో గంపలగూడెం' గోసవీడు రహదారి అభివృద్ధి

రూ. 25 లక్షల వ్యయంతో ఎంఎన్‌కె రోడ్డు' పోలవరం రోడ్డు అభివృద్ధి

రూ. 25లక్షల వ్యయంతో మారెపల్లి' కొత్తూరు (వయా) గున్నచింతలపాడు రహదారి అభివృద్ధి

రూ. 25లక్షల వ్యయంతో విస్సన్నపేటలక్ష్మీపురం రోడ్డు నుంచి తెల్లాడవారవల్లి అమ్మపాలెం రోడ్డు అభివృద్ధి

రూ. 20లక్షల వ్యయంతో పుట్రేల' కుంచిపర్తి (వయా) నర్మదానగర్ రహదారి అభివృద్ధి

రూ. 10లక్షల వ్యయంతో టిటి రోడ్డు' టిఆర్ రోడ్డు ( లింకు రోడ్డు ) అభివృద్ధి

రూ. 35లక్షల వ్యయంతో చెన్నవరం' మల్లవరం రహదారి అభివృద్ధి

మొత్తంగా 11 రహదారులకు కలిపి సుమారుగా 63 కిలో మీటర్ల మేర అభివృద్ధికి గానూ రూ.8.70 కోట్ల మేర నిధులను తిరువూరు నియోజకవర్గంకు కేటాయింపులు జరిగినట్లు తెలిపారు. తిరువూరు నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, సంబంధిత మంత్రి జనార్దన్ రెడ్డికు విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివ నాథ్ ( చిన్ని) ధన్యవాదాలు తెలిపారు.

నిధుల కేటాయింపుతో రహదారుల సత్వర అభివృద్ధి జరిగి ప్రజలకు మేలు చేకూరుతుందని, రహదారుల అభివృద్ధికి ప్రభుత్వపరంగా నిధులు కేటాయింపుల ద్వారా ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా నదుపాయాలు నమకూరనున్నాయని పేర్కొన్నారు. వ్యవసాయం, వ్యాపారం, విద్య, వైద్య రంగాలకు రహదారుల నిర్మాణంతో పురోగతి సాధ్యపడుతుందని, పార్లమెంటు నియోజకవర్గ పరిధి లోని అన్ని ప్రాంతాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

# మధ్యాహ్నం భోజనం తనికి చేసిన కలెక్టర్

**–కస్తూర్బా పాఠశాలలో రికార్డుల తనిఖీ**



భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 10: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహడ్ మండల కేంద్రంలో గల కస్తూర్బా బాలికల పాఠశాలను మంగళ వారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన పాఠశాల ఆవరణ ను పరిశీలించి పాఠశాలలోని రికార్డులు పరిశీలిన చేసి,అనంతరం మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా పరిశీలించారు.

విద్యార్థులకు నాణ్యత గల ఆహారం అందించి వారి ఆరోగ్యానికి దోహద పడాలి అని విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువుల్లో రాణిస్తారు అని అన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించకపోతే చర్యలు తప్పవని అన్నారు. మెనూ ప్రకారం భోజనం అందే విధంగా చూడాలని తహసీల్దార్ ప్రసాద్ ను ఆదేశించారు. హాస్టల్ లో వసతుల పై విద్యార్థులతో మాట్లాడి తెలుసుకున్నారు. కలెక్టర్ తో పాటు మండల తహసీల్దార్ ప్రసాద్, ఎంపిడిఓ జమలా రెడ్డి, అదేవిధంగా గ్రామ ఉపసర్పంచ్ గుండె వెంకన్న తదితరులు ఉన్నారు.

# ఇన్స్టాగ్రామ్ ఫేస్‌బుక్‌లకు దూరంగా ఉండండి..

నల్గొండ, మార్చి 10:మహిళల హక్కులు భారత రాజ్యాంగ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించామని రాప్తాడు డిఎస్పీ మహబూబ్ భాషా పేర్కొన్నారు. రాప్తాడు మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామం దగ్గర ఉన్న మాంటిస్సోరి ఎలైట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు అనంతపురం రూరల్ సబ్ డివిజన్ శక్తి టీం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.

ఈ సంధర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో మహిళలు చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాలను సురక్ష వాహనంలో డిజిటల్ స్క్రీన్ పై సైబర్ క్రైమ్ రోడ్ సేఫ్టీ గురించి స్క్రీన్ మీద వీడియోస్ ప్లే చేయించి చూపించామని తెలిపారు.ముఖ్యంగా వాట్సప్ ఫేస్ బుక్ ఇంస్టాగ్రామ్ లకు విద్యార్థులు మహిళలు దూరంగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తులతో ఫోటోలు దిగడం వలన ఫోటోను మార్ఫింగ్ చేసి బ్లాక్ మెయిల్ ఎలా చేస్తున్నారు వివరించమన్నారు.

బాలికలు తమను తాము ఎలా రక్షించుకోవాలి సైబర్ నేరాలు ఏటీఎం మోసాలు డ్రగ్స్ వాడకం ఫేక్ కాల్స్ బ్యాంకుల పేరుతో నకిలీ ఫోన్ కాల్స్ ఓటిపి వంటి వాటి గురించి విద్యార్థులకు క్షుప్తంగా వివరించాము.ప్రమాద సమయాల్లో 100 లేదా112 లేదా1098 లేదా181 ఫోన్ నెంబర్లకు ఫోన్లు కచ్చితంగా చేయాలని తెలియజేశాము.

ఈ కార్యక్రమంలో పాఠశాల మాంటిస్సోరి ఎలైట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ డైరెక్టర్ కృష్ణ భరత్ కరస్పాండెంట్ కృష్ణ సమీరా ప్రిన్సిపల్ ప్రతాప రెడ్డి ఉపాధ్యాయులు విద్యార్థులు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి ఇంట్లో సూర్యఘర్ వెలుగులు నింపుదాం

**–పీఎం సూర్యఘర్ పథకంపై ప్రజల్లో అవగాహన పెంచాలి.**
**–సూర్యాంధ్ర ప్రగతి శకటాల ద్వారా జనజాగృతికి శ్రీకారం..**
**–ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



విజయవాడ, మార్చి 10: సౌరశక్తి వినియోగంపై ప్రజలను ప్రోత్సహిస్తూ ప్రతి ఇంట్లో సూర్యఘర్ వెలుగులు నింపుదామని.. పీఎం సూర్యఘర్ పథకంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు సూర్యాంధ్ర ప్రగతి శకటాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.

నేషనల్ సోలార్ ఎనర్జీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్ఈఎఫ్ఐ) ? సూర్యాంధ్ర ప్రగతి రథ శకటాలను కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మంగళవారం కలెక్టరేట్‌లో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ విద్యుత్ బిల్లుల నుంచి విముక్తి లభించడంతో పాటు పర్యావరణ హిత జీవితానికి ఈ పథకం దోహదం చేస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చేయూతతో అమల్లో ఉన్న పీఎం సూర్యఘర్ - ముఫ్త్ బిజ్లీ యోజన పథకం ద్వారా 60 శాతం వరకు రాయితీతో సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేసుకొని విద్యుత్ వినియోగదారులు ఉత్పత్తిదారులుగా మారొచ్చన్నారు.

ఇంటి అవసరాలకు ఉపయోగించుకోగా మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు అమ్మడం ద్వారా అదనపు ఆదాయం కూడా పొందవచ్చని పేర్కొన్నారు. విద్యుత్ స్వయం సమృద్ధితో విద్యుత్ కొనుగోలుపై ఆధారపడాల్సిన అవసరం లేదన్నారు. ఇంటి యజమానులు, అపార్టుమెంట్లు, హౌసింగ్ సొసైటీలు, చిన్న, మధ్యతరహా వ్యాపారస్తులు, రైతులు పథకానికి అర్హులని వివరించారు.

పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించేందుకు ఎన్ఎస్ఈఎఫ్ఐ ? సూర్యాంధ్ర ప్రగతి రథాల ద్వారా గ్రామాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ రథం ద్వారా పీఎం సూర్యఘర్ పథకం ప్రయోజనాలు, దరఖాస్తు విధానం, సబ్సిడీ వివరాలు ప్రజలకు తెలియజేయడం జరుగుతుందని, ఎన్ఎస్ఈఎఫ్ఐ సీఈవో సుబ్రహ్మణ్యం పులిపాక మార్గనిర్దేశనంతో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషిచేస్తున్నట్లు సంస్థ ప్రతినిధి సీహెచ్ ఉదయ్ తెలిపారు.

# అసెంబ్లీ సమావేశాల్లో ప్రైవేట్ మెంబర్ బిల్లు పెడతాం..

## కాంగ్రెస్ మోసాన్ని ఎండగడతాం : కేటీఆర్

హైదరాబాద్, మార్చి 10: కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఆరు గ్యారెంటీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత మోసం చేస్తున్న తీరును ఎండగట్టేందుకు ఆరు గ్యారెంటీలకు ఇచ్చిన మాట ప్రకారం చట్టబద్ధత కల్పించేందుకు ఈ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భారత రాష్ట్ర సమితి తరపున ఒక ప్రైవేట్ మెంబర్ బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు.

ఈ రోజు గోల్కొండ రిసార్ట్ లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఉమ్మడి ఓరియంటేషన్ సమావేశం ముగిసిన అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. అధికారంలోకి రాగానే తొలి క్యాబినెట్ సమావేశంలోనే 6 గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ ఆ హామీని, ఆ మాటను మరిచిపోయిందని అన్నారు. అందుకే ఆరు గ్యారెంటీల ద్వారా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు కాంగ్రెస్ ప్రభుత్వం కల్పిస్తుందని చెప్పి ఓట్లు వేయించుకున్న కాంగ్రెస్ పార్టీ మోసాన్ని ఈ బిల్లు ద్వారా ఎండగడతామన్నారు. 6 గ్యారంటీలలో పేర్కొన్న మహిళలు, వృద్ధులు, వికలాంగులు, విద్యార్థులు, రైతన్నలు వంటి తెలంగాణ సబ్బండ వర్గాలకు కాంగ్రెస్ పార్టీ చేసిన మోసం నేపథ్యంలో ఆయా వర్గాల తరఫున ఈ ప్రైవేట్ మెంబర్ బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు కేటీఆర్ తెలిపారు.రాహుల్ గాంధీతో సహా 6 గ్యారంటీలకు చట్టబద్ధత ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పెద్దలు కాంగ్రెస్ పార్టీ మోసాన్ని కూడా ఈ బిల్లు ద్వారా శాసనసభలో ఎండగడతామన్నారు. కాంగ్రెస్ పార్టీ సభ్యులు కూడా ఈ బిల్లుకు మద్దతు ఇచ్చి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఈసారి కాంగ్రెస్ పెడుతున్న బడ్జెట్.. మూడవ బడ్జెట్. ఈసారి బడ్జెట్ సమావేశాలకు అత్యంత ప్రాధాన్యత ఉంది.

ఇప్పటికే సగం ప్రభుత్వ పదవీ కాలం అయిపోయింది. హామీల అమలులో ప్రజలు ఇచ్చిన వ్యవధి అయిపోయింది. వారి హామీల అమలు వైఫల్యాన్ని, మోసాన్ని ఎండగట్టేందుకు ఈ బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహం పైన ఈరోజు సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నాం. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు, కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అరాచకాల పైన ఈ అసెంబ్లీ సమావేశంలో అనుసరించాల్సిన వ్యూహం పైన చర్చించామని కేటీఆర్ తెలిపారు. మా పార్టీ సీనియర్ నేతలు మధుసూదనాచారి, బండ ప్రకాష్, తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రా రెడ్డి తదితరులు మాట్లాడారు.

# గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషి

**– కట్టంగూర్ సర్పంచ్ ముక్కామల శ్యామల**

నల్గొండ, మార్చి 10: గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించేందుకు కృషి చేస్తున్నట్లు కట్టంగూర్ సర్పంచ్ శ్యామల తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కట్టంగూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెడికల్ క్యాంప్‌ను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామ ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్యులు శ్వేత, జయంత్, నవ్య, సాయి ప్రదీప్తి, కమల, వెంకటేశ్వర్లు మెడికల్ క్యాంప్‌నకు వచ్చిన వృద్ధులు, గర్భిణీలు, మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది నరేందర్ రెడ్డి, సిహెచ్ రమణ, శ్రీపాద రమేష్, లింగయ్య, వార్డు సభ్యులు ఏనుగు సైదులు, పులకరం శ్రీను, కళ్లెం నాగేశ్వర్ రావు, పాల్గొన్నారు.

# భూ వివాదాలకు ముగింపు పలికే లక్ష్యంతో భూ రీ సర్వే

## – మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్



మెదక్, మార్చి 10: రైతుల భూ హక్కులను పక్కాగా నమోదు చేసి భూ వివాదాలకు ముగింపు పలికే లక్ష్యంతో భూ రీ సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు. మంగళవారం రామాయంపేట మండలంలోని అక్కన్నపేట గ్రామంలో నిర్వహించిన భూభారతి రీ సర్వే అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.తెలంగాణ వార్తాపత్రిక

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. సుమారు వందేళ్ల క్రితం నిజాం ప్రభుత్వ కాలంలో 35 నుంచి 40 సంవత్సరాల పాటు శ్రమించి భూముల నక్షాలను రూపొందించారని తెలిపారు. అప్పటి నుంచి కొన్ని గ్రామాల్లో భూ నక్షాలలో సమస్యలు తలెత్తాయని పేర్కొన్నారు. వాటిని పరిశీలించి పరిష్కరించేందుకే భూ రీ సర్వే కార్యక్రమాన్ని శాస్త్రీయంగా అమలు చేస్తున్నామని చెప్పారు.తెలంగాణ వార్తలురీ సర్వే ద్వారా ప్రతీ భూ కమతాన్ని ఆన్‌లైన్ డిజిటలైజేషన్‌లో నమోదు చేసి భూధార్ కార్డులను అందజేస్తామని తెలిపారు. భూమి ప్రతీ రైతుకు ఒక సెంటిమెంట్ అని, భూమి కోసం రైతులు ఎంతగానో కష్టపడుతుంటారని పేర్కొన్నారు. భూ సమస్యలు లేకుండా చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. మెదక్ జిల్లాలో 24 గ్రామాల్లో భూ రీ సర్వేను శాస్త్రీయంగా నిర్వహించి రైతుల భూ హక్కులను పరిరక్షిస్తామని తెలిపారు.

రీ సర్వే పూర్తయ్యాక విదేశాల్లో ఉన్న వారు సైతం తమ భూములను ఆన్లైన్ ద్వారా సులభంగా పరిశీలించుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీఓ రమాదేవి, ఏడీ ల్యాండ్ సర్వే కిషన్, డీపీఆర్వో రామచంద్రరాజు, తహసీల్దార్ రజినీ, ఎంపీడీవో, గ్రామ సర్పంచ్ అనిల్, ఉప సర్పంచ్ ప్రసాద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# తుంగతుర్తిలో సావిత్రిబాయి పూలే వర్ధంతి



నల్గొండ, మార్చి 10:సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే వర్ధంతిని బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం తుంగతుర్తి మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాడుకొండ సీతయ్య మాట్లాడుతూ.. సమాజ అభ్యున్నతికి ఆమె చేసిన సేవలను స్మరించుకున్నారు. బడుగు, బలహీన వర్గాల విద్య కోసం, సామాజిక సమానత్వం కోసం సావిత్రిబాయి చేసిన కృషి ఎందరికో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తూనికి సాయిలు, గోపగాని రమేశ్ గౌడ్, గోపగాని శ్రీను, తడకమళ్ల మల్లికార్జున్, వెంకన్న, కడియం గోపి, లతీఫ్ పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి : కలెక్టర్ అంకిత్

## –బూర్గంపహాడ్‌లో రెసిడెన్షియల్, కస్తూర్బా పాఠశాలల ఆకస్మిక తనిఖీ



ఖమ్మం, మార్చి 10: గురుకులాలతో పాటు ప్రభుత్వ పాఠశాల, వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని, వారి ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని కలెక్టర్ అంకిత్ అధికారులను హెచ్చరించారు. మంగళవారం బూర్గంపహాడ్ మండల కేంద్రమైన బూర్గంపహాడ్ తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) పాఠశాలలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. తొలుత రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరాతీసి భోజన నాణ్యత, పాఠశాల నిర్వహణ, పరిశుభ్రతను పర్యవేక్షించారు. ఆరుబయట ఉన్న ఐస్క్రీమ్ డిస్క్ బండిని గమనించిన కలెక్టర్ అక్కడకు స్వయంగా వెళ్లి ఐస్‌క్రీమ్స్ గడువు తేదీలు, నాణ్యతను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నాణ్యత లేని, గడువు తీరిన ఆహార పదార్థాలు విక్రయించవద్దన్నారు. పాఠశాలలు, వసతిగృహాల్లోకి బయటి నుండి వచ్చే ఆహార పదార్థాలు అనుమతించవద్దన్నారు.

అనంతరం కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేసి తరగతి గదులు, మరు గుదొడ్లు, వంటశాలలో ఆహార పదార్థాలను క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యతతో ఉన్నాయో లేదో అడిగి తెలుసుకుని రుచి చూశారు. విద్యార్థులకు నిర్ణీత సమయంలో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, భోజన విషయంలో నిబంధనలు పాటించకపోతే శాఖాపరమైన చర్యలు ఉంటాయన్నారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థుల పఠనా సామర్థ్యాన్ని పరిశీలించారు. విద్యార్థుల పఠనా సామర్థ్యం మరింత పెంపొందించేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలల పరిసరాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మరుగుదొడ్లు రోజుకు మూడుసార్లు శుభ్రం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సిబ్బందిని ఆదేశించారు. ఉదయం విద్యార్థులకు రాగిజావ, పల్లిపట్టి ఇవ్వాలని, పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహించాలని, ఆ సమయంలో వారికి స్నాక్స్ అందించాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట ఎంపీడీఓ జమలారెడ్డి, తాసీల్దార్ కేఆర్కే ప్రసాద్, ఎంఈఓ యదుసింహరాజు, రెసిడెన్షియల్, కస్తూర్బా సిబ్బంది ఉన్నారు.

# పశ్చిమాసియా గగనతల పరిస్థితి – ఈ రోజు 50 విమానాలను నడిపేందుకు సిద్ధమైన భారతీయ వైమానిక సంస్థలు

న్యూఢిల్లీ, మార్చి 10:భారత్, పశ్చిమాసియా మధ్య విమానయానాన్ని ప్రభావితం చేస్తున్న పశ్చిమాసియాలో పరిస్థితులను పౌర విమానయాన మంత్రిత్వ శాఖ నిశితంగా పర్యవేక్షిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ప్రయాణికులకు భద్రత, క్రమబద్ధమైన విమాన ప్రయాణాన్ని అందించేందుకు అవసరమైన కార్యాచరణ సర్దుబాట్లను విమానయాన సంస్థలు చేపడుతున్నాయి.

ఈ ప్రాంతం నుంచి 8,175 మంది 51 విమానాల ద్వారా భారతదేశానికి చేరుకున్నట్లు 2026 మార్చి 7 నాటి ప్రయాణికుల సమాచారం తెలియజేస్తోంది.

దుబాయ్, అబుదాబీ, రస్ అల్ ఖైమా, ఫుజైరా, మస్కట్, జెడ్డా తదితర ప్రాంతాల్లోని విమానాశ్రయాల నుంచి 2026 మార్చి 8న భారతీయ విమానయాన సంస్థలైన ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, ఇండిగో, స్పైస్‌జెట్, ఆకాశ 49 విమానాలను నడిపాయి.

ప్రస్తుత పరిస్థితి ఆధారంగా 2026 మార్చి 9న 50 విమానాలను నడిపేందుకు భారతీయ విమానయాన సంస్థలు సిద్ధంగా ఉన్నాయి.

ఈ ప్రాంతంలోని ఇతర విమానాశ్రయాల్లో క్షేత్రస్థాయి పరిస్థితిని భారతీయ వైమానిక సంస్థలు నిరంతరం అంచనా వేస్తున్నాయి. దీనివల్ల ఆ ప్రదేశాల నుంచి మరిన్ని విమానాలను భారతీయ విమానయాన సంస్థలు నడిపేందుకు వీలుంటుంది.

ఎయిర్‌లైన్స్, సంబంధిత ఇతర సంస్థలతో మంత్రిత్వ శాఖ నిరంతరం సమన్వయం చేస్తోంది. ఈ సమయంలో విమానయాన ఛార్జీలు సహేతుకంగా ఉండేలా, అసంబద్ధంగా ధరలను పెంచకుండా పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తోంది.

ఫ్లైట్ షెడ్యూళ్లకు సంబంధించిన తాజా సమాచారం కోసం సంబంధిత ఎయిర్‌లైన్స్‌ను సంప్రదించాలని ప్రయాణికులకు సూచించారు. మంత్రిత్వ శాఖ పరిస్థితిని నిశితంగా గమనిస్తోంది. అవసరాన్ని బట్టి తాజా సమాచారాన్ని అందిస్తారు.

# గని తవ్వకపు ప్రాంతాల రూపాంతరీకరణ: గనుల సుస్థిర పునర్వినియోగంలో ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్ ప్రస్థానం

న్యూఢిల్లీ, మార్చి 10:దేశవ్యాప్తంగా నేలబొగ్గు (లిగ్నైట్) తవ్వకపు ప్రాజెక్టులలో క్రమబద్ధ గని పునరుద్ధరణ, పర్యావరణ అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణలో నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎల్‌సీఐఎల్) పలు విజయాలు సాధించింది. ఈ మేరకు కేంద్ర బొగ్గు మంత్రిత్వశాఖ పరిధిలోని ఈ నవరత్న హోదాగల సంస్థ సుస్థిర మైనింగ్, పర్యావరణ పునరుద్ధరణకు గణనీయ చర్యలు చేపట్టింది.

బాధ్యతాయుత మైనింగ్, పర్యావరణ సుస్థిరతపై దృష్టి సారిస్తూ తాము నేలబొగ్గు తవ్విన ప్రాంతాల్లో భారీ ఎత్తున భౌతిక-జీవ పునరుద్ధరణ కార్యక్రమాలను అమలు చేసింది. తవ్వకపు వ్యర్థాల (ఓవర్ బర్డెన్) గుట్టలు, గనులు తవ్విన గోతులు (బ్యాక్ ఫిల్డ్ ల్యాండ్)ను క్రమపద్ధతిలో పునరుద్ధరించింది. అంతేకాకుండా వాటిని చక్కని పచ్చిక మైదానాలు, పర్యావరణ పార్కులు, జల వనరులు, ఉత్పాదక వ్యవసాయ మండలాలుగా రూపాంతరీకరించింది. తద్వారా గనుల తవ్వకపు ప్రాంతాలను పర్యావరణ, సామాజిక ప్రయోజనార్థం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడం సాధ్యమని ఆచరణాత్మకంగా రుజువు చేసింది.

### భారీ స్థాయిలో గనుల పునరుద్ధరణ

గనులు తవ్విన భూమిని పునరుపయుక్తంగా మార్చడంలో 'ఎన్ఎల్‌సీఐఎల్' చేపట్టిన కార్యక్రమాలు గణనీయ పునరుద్ధరణకు దోహదం చేశాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 28 నాటికి తమ పరిధిలో గని తవ్వకపు ప్రాంతాల మొత్తం విస్తీర్ణాన్ని 6,571 హెక్టార్లుగా కంపెనీ పేర్కొంది. ఇందులో 3,236 హెక్టార్ల భూమిని భౌతికంగా, మరో 2,866 హెక్టార్ల భూమిని జీవశాస్త్ర పరంగా పునరుద్ధరించినట్లు నివేదించింది. ఇందులో భాగంగా తోటల పెంపకం కార్యకలాపాలు కూడా విస్తృతంగా చేపట్టి, గని తవ్వకపు ప్రాంతాల్లో 33.95 లక్షల మొక్కలు నాటినట్లు తెలిపింది.

పర్యావరణ పర్యాటక కేంద్రాలుగా గని తవ్వకపు ప్రాంతాల సుందరీకరణ

నైవేలి వద్ద పునరుద్ధరించిన గని ప్రాంతాలన్నీ ఇప్పుడు పర్యావరణ పర్యాటక కేంద్రాలుగా సుందర రూపం సంతరించుకున్నాయి. ఇందులో భాగమైన 'మైన్-1' పర్యావరణ పర్యాటక పార్కును 2020 జూలై 23న మొక్కలు నాటే కార్యక్రమం (వృక్షారోపణ్ అభియాన్) కింద అప్పటి కేంద్ర హోం మంత్రి ప్రారంభించారు. అనంతరం 'మైన్-2' పార్కుకు 2021 ఆగస్టు 19న అప్పటి బొగ్గు-గనులు, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రారంభోత్సవం చేశారు.

గని తవ్వకపు గోతులను పర్యావరణ హిత నౌకా విహారానికి వీలుగా కృత్రిమ సరస్సుల తరహాలో తీర్చిదిద్దారు. అంతేకాకుండా పచ్చిక మైదానాలు, ఉద్యానాలు, పక్షుల వీక్షణ ప్రాంతాలు, జింకల ప్రాంగణాలు, నర్సరీలు, 'మంచు మందిరాలు' (మిస్ట్ చాంబర్)గా రూపొందించారు. వ్యర్థాల గుట్టలున్న ప్రదేశాలను వ్యవసాయ భూములుగా అభివృద్ధి చేశారు.

ఈ విధంగా 'ఎన్ఎల్‌సీఐఎల్' పరిధిలోని మైన్-1, 2 సహా గని తవ్వకపు భూములన్నీ నేడు క్రమంగా పర్యావరణ ఆవాసాలుగా రూపొందుతూ వివిధ రకాల వన్యప్రాణులను ఆకర్షిస్తున్నాయి. దీంతో ఈ ప్రాంతాల్లోని కృత్రిమ సరస్సులు ఇప్పుడు దాదాపు 107 జాతుల వలస పక్షులకు ఆతిథ్య మిస్తున్నాయి. పునరుద్ధరించిన గని ప్రాంతాల పర్యావరణ సామర్థ్యాన్ని ఈ కార్యక్రమాలు ప్రతిబింబిస్తున్నాయి. ఇక్కడికొచ్చే పక్షి జాతులలో ఏషియన్ కోయెల్ (యూడినామిస్ స్కోలోపేసియా), బ్లాక్-హెడ్ మునియా (లోంచురా మలక్కా), బ్లాక్ కైట్ (మిల్వస్ మైగ్రాన్స్), ఏషియన్ ప్యారడైజ్ ఫ్లైక్యాచర్ (టెర్ప్సిఫోన్ పారడిసి), ఏషియన్ గ్రీన్ బీ-ఈటర్ (మెరోప్స్ ఓరియంటాలిస్), ఏషియన్ బ్రౌన్ ఫ్లైక్యాచర్ (మస్సికాపా డౌరికా) వంటివి కనిపిస్తాయి.

ఈ ప్రాంతాల్లో పర్యావరణ పర్యాటకాన్ని మరింత ప్రోత్సహించే దిశగా 2022 అక్టోబరు 5న పాండిచ్చేరి టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌తో 'ఎన్ఎల్‌సీఐఎల్' అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. అటుపైన 2025 అక్టోబరు 2 నుంచి వారాంతాలు, సెలవు రోజులలో సందర్శకుల కోసం వీటిని ప్రారంభించారు.

### వృక్షసంపద వృద్ధితో బాహ్య దంప్ ప్రదేశంలో పరచుకున్న పచ్చదనం

### మరీచికోద్యానం: ప్రకృతి-పారిశ్రామిక ప్రగతి సంగమం

రాజస్థాన్‌లోని బీకానేర్ జిల్లా బార్సింగ్‌సర్‌లో ''మరీచిక ఉద్యానం'': ఎడారి పర్యావరణ పార్కును 'ఎన్ఎల్‌సీఐఎల్' తీర్చిదిద్దింది. పారిశ్రామిక ప్రగతి, పర్యావరణ పరిరక్షణ సంయుక్త పురోగమనానికి ఇదొక స్ఫూర్తిదాయక నిదర్శనంగా నిలుస్తుంది. నేలబొగ్గు తవ్వకం, థర్మల్-సౌర విద్యుదుత్పత్తిని ఏకీకృతం చేస్తూ తమిళనాడు వెలుపల బార్సింగ్‌సర్ వద్ద 'ఎన్ఎల్‌సీఐఎల్' చేపట్టిన తొలి ప్రాజెక్టు ఇది. ఇక్కడ 2006లో మైనింగ్ కార్యకలాపాలు మొదలై, ఇంధనోత్పత్తికి గణనీయంగా దోహదం చేయగా, అదే సమయంలో పర్యావరణ పునరుద్ధరణకు కూడా కంపెనీ ప్రాధాన్యమిచ్చింది. అనంతరం తవ్వకపు భూముల భౌతిక పునరుద్ధరణ కార్యకలాపాలను 2016లో ప్రారంభించగా, 2019 నుంచి జీవశాస్త్ర పరంగా పునరుద్ధరణ ఊపందుకుంది. ఈ సుస్థిర, శాస్త్రీయ కృషితో దాదాపు 40 హెక్టార్లలో పచ్చదనం వెల్లివిరిసింది.

సుస్థిర ప్రగతి నిర్దేశిత దృక్కోణంలో భాగంగా ఈ ప్రాంతంలోని సుమారు 2 హెక్టార్ల విస్తీర్ణంలో ఒక పర్యావరణ ఉద్యానం రూపొందింది. కేంద్ర బొగ్గు-గనుల శాఖ మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి 2024లో ఇక్కడ మొక్కల నాటే కార్యక్రమాన్ని ప్రారంభించినపుడు ఈ పార్కుకు శంకుస్థాపన చేశారు. ఈ నేపథ్యంలో మరీచిక ఉద్యానం నేడు పర్యావరణ పునరుద్ధరణకు సజీవ ఉదాహరణగా నిలిచింది. ఇందులో పిల్లల వినోద సదుపాయాలు, బొటానికల్ గార్డెన్, పుష్పవనం, జల నవీకరణ నిర్మాణాలు, కార్మికుల విశ్రాంతి కోసం పర్యావరణ హిత గదులు వంటివి అందుబాటులో ఉన్నాయి. ఈ ఉద్యానం ఇప్పుడు ఖేజ్రీ, వేప, అమల్తాస్, శీషమ్ వగైరా 21 వృక్షజాతుల నిలయం కాగా, ఎడారి నేపథ్యంలో ఇవి ప్రకృతి పచ్చదనంతో ఆహ్లాదం కలిగిస్తున్నాయి.

### సామాజిక ప్రయోజనార్థం గని నీటి నిల్వల వినియోగం

నైవేలిలో ఓపెన్-కాస్ట్ లిగ్నైట్ గనుల ప్రాంతంలో వర్షపాతం ఏటా సగటున 1200 మిల్లీమీటర్ల దాకా గణనీయంగా నమోదవుతుంది. ఈ నీటి వనరు సమర్థ నిర్వహణ కోసం 'ఎన్ఎల్‌సీఐఎల్' ''సమగ్ర గని నీటి వినియోగ-వర్షజల సేకరణ వ్యవస్థ''ను నిర్మించింది. ఇందులో 191.458 హెక్టార్ల మేర 88 జల సేకరణ నిర్మాణాలున్నాయి. ఈ జలవనరు నుంచి రోజుకు 550 లక్షల లీటర్ల శుద్ధి చేసిన నీటిని గృహ-నీటిపారుదల ప్రయోజనాల కోసం పరిసరాల్లోని 40 గ్రామాలకు సరఫరా చేస్తారు. అంతేగాక తమిళనాడు నీటి సరఫరా-మురుగు పారుదల బోర్డుతో ఒప్పందం కింద రోజుకు 425.10 లక్షల లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నారు. తద్వారా కడలూరు జిల్లాలోని 6 పట్టణ పంచాయతీలు, 625 గ్రామాల్లోని 7.91 లక్షల మంది ప్రజలకు ప్రయోజనం చేకూరుతోంది.

### గని వ్యర్థాలు నిర్మాణ సామగ్రిగా మార్పు

''వ్యర్థం నుంచి అర్థం'' భావనను కూడా 'ఎన్ఎల్‌సీఐఎల్' ఆచరణలో పెట్టింది. ఈ మేరకు గని తవ్వకపు వ్యర్థాలను ఉపయుక్త నిర్మాణ సామగ్రిగా మారుస్తోంది. ఇందులో భాగంగా 'సెంటర్ ఫర్ అప్లైడ్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, ఐఐటీ-మద్రాస్ సంయుక్త సహకారంతో పరిశోధనలు నిర్వహించింది. దీంతో గని వ్యర్థాల (ఓవర్ బర్డెన్)లో 40 నుంచి 60 శాతాన్ని ఇసుక రూపంలో పొందవచ్చని తేలింది.

ఈ పరిశోధన ఫలితాలకు అనుగుణంగా గని వ్యర్థాల నుంచి నిర్మాణ కార్యకలాపాలకు అవసరమైన ఇసుక ఉత్పత్తి కోసం నైవేలి గనులలో 'పైలట్ ఎం' పేరిట వ్యర్థాల శుద్ధి ప్లాంట్లను ఏర్పాటు చేశారు. ఈ మేరకు 2024 జనవరిలో 'మైన్-1ఎ' కింద ఏటా 2.62 ఎల్ఎంట సామర్థ్యంతో ఒక ఓవర్‌బర్డెన్ ప్రాంతం నుంచి ఇసుక ప్లాంటు పనిచేయడం మొదలైంది. ఆ తర్వాత 2026 ఫిబ్రవరిలో 'మైన్-1'లో ఏటా 6.25 ఎల్ఎంట సామర్థ్యంగల మరొక ప్లాంటు ప్రారంభమైంది. సుస్థిర నిర్మాణ కార్యకలాపాల కోసం ఓవర్‌బర్డెన్ నుంచి ఎం-శాండ్ ఉత్పత్తి దిశగా కాలుష్య రహిత కార్యక్రమానికి మార్గనిర్దేశం చేసేందుకు 'సీఫ్లో సంస్థతో 'ఎన్ఎల్‌సీఐఎల్' భాగస్వామ్యం ఏర్పాటు చేసుకుంది.

మైన్ -1ఎ ఓవర్ బర్డెన్ నుంచి ఎం-శాండ్ ఉత్పత్తి చేసే ప్లాంటు

### భూసార పునరుద్ధరణ ? అత్యాధునిక వ్యవసాయానికి ప్రోత్సాహం

పునరుద్ధరించిన గని ప్రాంతాలలో భూసారం మెరుగు దిశగా 'ఎన్ఎల్‌సీఐఎల్' వినూత్న వ్యవసాయ పద్ధతులను అమలు చేస్తోంది. ఈ మేరకు బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సీ) సహకారంతో పాలీహౌస్‌లలో హైడ్రోపోనిక్ సాగుకు శ్రీకారం చుట్టింది. నీటి పొదుపు సహిత వ్యవసాయంలో భాగంగా ఇజ్రాయెల్ బిందుసేద్య సాంకేతికతను కూడా అనుసరిస్తోంది.

సహజ ఎరువుతో నేలను సుసంపన్నం చేయడంలో భాగంగా దేశీయ పశుగణంతో పశుపోషణ ద్వారా నేల జీవోద్ధరణను ప్రోత్సహించింది. ఈ చర్యల ద్వారా బంజరుగా మారిన ఓవర్‌బర్డెన్ ప్రదేశాలను ఉత్పాదక వ్యవసాయ భూమిగా మార్చింది.

కాలుష్య నివారణ కార్యక్రమాల విస్తరణ

గనుల సుస్థిర పునరుద్ధరణలో భాగంగా మొక్కల పెంపకం, పర్యావరణ అవగాహన కార్యక్రమాలను 'ఎన్ఎల్‌సీఐఎల్' నిర్వహిస్తోంది. ఈ మేరకు 2020 నుంచి మొక్కలు నాటే కార్యక్రమం కింద 6,45,000 మొక్కల పంపిణీ, నాటడం నిర్వహించారు.

పరిశుభ్రత కార్యకలాపాలలో కృషికిగాను ప్రభుత్వ రంగ బొగ్గు సంస్థల స్థాయిలో 'స్వచ్ఛత పఖ్వాడా' కింద 'ఎన్ఎల్‌సీఐఎల్' ప్రథమ బహుమతి పొందింది. స్వావలంబన దిశగా గాంధీజీ సిద్ధాంతానికి ప్రాచుర్యం కల్పించే ప్రత్యేక కార్యక్రమం 4.0 కింద ''ప్రజా ప్రయోజనార్థం వ్యర్థాలను అర్థంగా మార్చడం''పై దృష్టి సారిస్తూ ఈ వినూత్న కార్యకలాపాలను చేపట్టింది.

ఇందులో భాగంగా నైవేలిలోని మైన్-1 పరిధిలో 1.25 ఎకరాల విస్తీర్ణంలో తీర్చిదిద్దిన ''పొదిగై హెర్బల్ పార్కు''ను 2024 అక్టోబరు 30న ప్రారంభించారు. ఈ ఉద్యానంలో దాదాపు 38 రకాల ఔషధ మొక్కలను పెంచుతున్నారు. వ్యాధుల చికిత్సలో సాధారణ మొక్కల నుంచి లభించే ఔషధ ప్రయోజనాలపై అవగాహన కల్పించడం దీని లక్ష్యం.

అలాగే, మైన్-2 వద్ద నేల ఎత్తుపల్లాలను చదును చేసి, దాదాపు 109 మెట్రిక్ టన్నుల చెత్తను తొలగించిన తర్వాత 'లిగ్నైట్ గార్డెన్'ను ఏర్పాటు చేశారు. పూర్తిగా పునరుద్ధరించిన ఈ ప్రదేశంలో ఇప్పుడు అంబులెన్స్ పార్కింగ్, ఎఫ్ఎం యార్డ్ మినీ రిపేర్ షెడ్, సోలార్ ప్లాంటు ఉన్నాయి. అంతేకాకుండా పునరుద్ధరించిన ప్రదేశంలో 8,15,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో కొబ్బరి తోటను ఏర్పాటు చేశారు.

రాజస్థాన్‌లోని బార్సింగ్‌సర్ ప్రాజెక్టులో లోగడ నిరుపయోగంగా మిగిలిన 6,700 చదరపు అడుగుల విస్తీర్ణంలో దాదాపు 6,000 మొక్కలతో 'లిగ్నైట్ శక్తి నగర్ నర్సరీ'ని ఏర్పాటు చేశారు.

'వ్యర్థం నుంచి అర్థం' ఇతివృత్తం కింద లోహపు చెత్తతో సృష్టించబడిన శిల్పాలను కూడా ఏర్పాటు సంస్థ ఏర్పాటు చేసింది. వీటిలో కడలూరులోని ''త్రీ ఫేసెస్'', చెన్నైలోని ''నెమలి'', న్యూఢిల్లీలోని ''జై హింద్ చక్ర'', 'ఎన్ఎల్‌సీఐఎల్' ఆర్చ్ గేట్ వద్ద ''మైనర్ రీడింగ్ బుక్'' విశేష ప్రాచుర్యం పొందాయి.

సుస్థిర మైనింగ్‌కు మద్దతు

సుస్థిర మైనింగ్, పర్యావరణ పునరుద్ధరణ, తవ్వకపు భూమి ఉత్పాదక పునర్వినియోగం తదితరాలను ప్రోత్సహించే కేంద్ర ప్రభుత్వ విస్తృత దృక్కోణానికి అనుగుణంగా 'ఎన్ఎల్‌సీఐఎల్' చేపట్టిన పర్యావరణ, సామాజిక హిత కార్యకలాపాలు సత్ఫలితాలిచ్చాయి.

బాధ్యతాయుత మైనింగ్, పర్యావరణ పరిరక్షణకు సమ ప్రాధాన్యంతో గనుల తవ్వకపు ప్రదేశాలను సుందర ప్రకృతి దృశ్యాలకు నెలవుగా మార్చి, పచ్చదనం నింపడమేగాక ఉత్పాదక, సమాజ ఉపయుక్త పర్యావరణ వ్యవస్థలుగా వాటిని రూపొందించవచ్చునని 'ఎన్ఎల్‌సీఐఎల్' తన కార్యక్రమాల ద్వారా రుజువు చేసింది.

# జ్ఞాన భారతం మిషన్

న్యూఢిల్లీ, మార్చి 10:జ్ఞాన భారతం మిషన్‌ను కేంద్ర బడ్జెట్ 2025-26లో ప్రకటించారు. భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ (ఎంఓసీ) ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా రాతప్రతుల వారసత్వాన్ని వెలికితీయటం, భద్రపరచటం, సంరక్షించటమే ప్రధాన లక్ష్యం.

ఈ కార్యక్రమానికి మద్దతిస్తూ, స్టాండింగ్ ఫైనాన్స్ కమిటీ (ఎస్ఎఫ్‌సీ) 2025-2031 సమయానికి గానూ రూ.491.66 కోట్ల నిధులను మంజూరు చేసింది. రాతప్రతులకు సంబంధించి సర్వే, నమోదు, పటిష్ఠమైన సాంకేతిక సదుపాయాలు, భాగస్వామ్య నిర్మాణం, డాక్యుమెంటేషన్, సంరక్షణ, డిజిటైజేషన్, రాతప్రతుల ప్రచురణలు, సామర్థ్య పెంపుదల, పరిశోధన వంటి కార్యకలాపాల కోసం ఈ నిధులను వినియోగిస్తారు.

2026-27 సంవత్సరానికి భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) బడ్జెట్ పెంపు ప్రతిపాదనకు సంబంధించి అంచనాల బిల్లు (2026-27)ను పార్లమెంటు ఆమోదించి.. రాష్ట్రపతి అంగీకరించాల్సి ఉంది.అన్వేషణలు, తవ్వకాల సమయంలో భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) లైడార్, జీపీఆర్, డ్రోన్ సర్వే వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తుంది. రాజ్‌గిర్ (బీహార్), రాఖీగఢీ (హర్యానా), బిస్మక్‌నగర్ (అరుణాచల్ ప్రదేశ్), వరంగల్ కోట (తెలంగాణ) వంటి పురావస్తు ప్రదేశాల్లో తవ్వకాలు జరపటానికి ముందుగానే లైడార్, జీపీఆర్, డ్రోన్ సర్వేలు నిర్వహించారు. అవసరానికి అనుగుణంగా తవ్వకానికి ముందే ఈ అధునా తన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తారు.మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ సహా దేశవ్యాప్తంగా కేంద్ర రక్షిత కట్టడాల వద్ద ఆక్రమణలను తొలగించటానికి కఠినమైన చట్ట, పాలనాపరమైన చర్యలు తీసుకుంటున్నారు. తరచూ తనిఖీలు నిర్వహిస్తూ, అనధికారిక నిర్మాణాలు లేదా ఆక్రమణలను నిలిపివేయటానికి ఏఎస్ఐ నోటీసులు జారీ చేసుంది. పురాతన స్మారక చిహ్నాలు, పురావస్తు స్థలాలు, అవశేషాల చట్టం-1958, పురాతన స్మారక చిహ్నాలు, పురావస్తు స్థలాలు, అవశేషాల నియమావళి-1959లోని నిబంధనలతో పాటు, ప్రభుత్వ ప్రాంగణాల (అనధికార నివాసితుల తొలగింపు) చట్టం-1971 ప్రకారం తొలగింపు చర్యలు చేపట్టారు.

జాతీయ ప్రాముఖ్యత గల రక్షిత కట్టడాల కోసం ప్రత్యేకంగా రూపొందించిన అడాప్ట్ ఎ హెరిటేజ్ 2.0 కార్యక్రమం సెప్టెంబర్ 2023లో ప్రారంభమైంది. ఇందులో భాగంగా ప్రైవేట్, ప్రభుత్వ రంగ సంస్థలు, ఎన్‌జీఓలు, ట్రస్టులు, సొసైటీలతో భాగస్వామ్యం కుదుర్చుకోవటానికి పటిష్ఠమైన వ్యవస్థను రూపొందించారు. ఎంపిక చేసిన చారిత్రక కట్టడాల వద్ద పర్యాటకులకు అవసరమైన వసతులను అభివృద్ధి చేయటం ద్వారా ఆయా ప్రాంతాలను పర్యాటక అనుకూల ప్రదేశాలుగా మార్చటమే ఈ కార్యక్రమం ఉద్దేశం.

# దుర్గ పూజకు ప్రచారం... అంతర్జాతీయ గుర్తింపు

న్యూఢిల్లీ, మార్చి 10:దుర్గ పూజను సాంస్కృతిక శాఖకు చెందిన గ్లోబల్ ఎంగేజ్‌మెంట్ స్కీములో భాగంగా ప్రపంచమంతటా తీసుకుపోయేందుకు చేసే ఉద్దేశంతో అంతర్జాతీయ సంస్థలకు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నారు.

యునెస్కోలో అమూర్త సంస్కృతి కేటగిరీలో నామినేషన్ కోసం దుర్గ పూజ గురించి పరిశోధన, డాక్యుమెంటేషన్ ప్రక్రియల్ని పూర్తి చేసి నివేదించడానికి ఈ మంత్రిత్వ శాఖ 2023లో రూ.22,29,244ను కేటాయించింది.

టోక్యోలో నివసించే భారతీయ బెంగాలీ సమాజానికి ప్రాతినిధ్యం వహిస్తున్న 'ఇప్పాన్ షాదన్ హౌజిన్ ఇండోజిన్నో సుదోయి' సహకారంతో దుర్గ పూజ వేడుకల వీడియోను సంగీత నాటక అకాడమీ (ఎస్ఎన్ఏ) 2025 సెప్టెంబర్లో ప్రజలతో పంచుకుంది. దుర్గ పూజా ఉత్సవాన్ని ఇప్పాన్ షాదన్ హౌజిన్ ఇండోజిన్నో సుదోయి అమిత భక్తిశ్రద్ధలతోనూ, సాంస్కృతికోత్సాహంతోనూ నిర్వహిస్తోంది. దీనికి తోడు, ఢిల్లీ లోని ఎర్రకోటలో 2025 డిసెంబరు 8 నుంచి 13 తేదీల మధ్య అంతర ప్రభుత్వ సంఘ సమావేశాల్ని నిర్వహించిన సందర్భంగా సాంప్రదాయిక 'ధునుచీ నాచ్'ను ప్రదర్శించారు. ఈ నృత్యాన్ని యునెస్కో అధికారులతో పాటు 190కి పైగా దేశాల ప్రతినిధులు చూశారు.

అంతర్జాతీయ పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తన 'ఇన్‌క్రెడిబుల్ ఇండియా 2.0' ప్రచార ఉద్యమ పరిధిని క్రమంగా విస్తరిస్తోంది. దీన్లో భాగంగా దుర్గ పూజకు ప్రచారం కల్పించడంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. దుర్గ పూజను యునెస్కో అమూర్త సాంస్కృతిక వారసత్వంగా గుర్తించింది. దీనికి సంబంధించిన వ్యూహంలో డిజిటల్ మార్కెటింగ్, అంతర్జాతీయ ప్రసార మాధ్యమాల్లో కవరేజీతో పాటు విదేశీ సందర్శకుల దృష్టిని ఆకర్షించడానికి సాంస్కృతిక ప్రదర్శనలను ఏర్పాటు చేయడం వంటివి భాగంగా ఉన్నాయి.

సంగీత నాటక అకాడమీ కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖలో భాగంగా ఉన్న అమూర్త సాంస్కృతిక వారసత్వ నోడల్ ఏజెన్సీగా ఉంది. ఇది ఒక నిపుణుల సంఘాన్ని ఏర్పాటు చేసింది. ఈ సంఘం దుర్గ పూజ ఉత్సవంతో సంబంధం గల వ్యక్తులు, సమూహాలు, వివిధ సమాజాల చురుకైన భాగస్వామ్యాన్ని నిర్ధారించడానికి ప్రజాసంబంధాల్నీ, క్షేత్రస్థాయి కార్యక్రమాల్నీ పెద్ద ఎత్తున నిర్వహించింది. ఆసక్తిదారులతో చేపట్టిన క్షేత్ర స్థాయి సంప్రదింపులు లోతైన పరిశీలనలను అందించాయి. దీంతో ఈ సాంస్కృతిక ఆచారానికి సంబంధించిన వివరాలను సమగ్రంగా తెలుసుకొని నివేదికను తయారు చేయడం సాధ్యమైంది. ఈ ప్రయత్నాలన్నీ దుర్గ పూజ కాలక్రమంలో ఎలా మారుతూ వచ్చింది, కళాత్మక శ్రేష్ఠత్వాన్ని సంతరించుకొంది, ఆచార వ్యవహారాలు, సామాజిక, సాంస్కృతిక పార్శ్వాల తాలూకు వివరాలన్నిటినీ వ్యవస్థీకృతంగా నమోదు చేసి, జాతీయ స్థాయిలోనూ, అంతర్జాతీయ స్థాయిలోనూ వ్యాప్తి చేయడంలో తోడ్పడతాయి.

ఈ సమాచారాన్ని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి శ్రీ గజేంద్ర సింగ్ షెఖావత్ ఈ రోజు లోక్‌సభలో ఓ ప్రశ్నకు లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో అందించారు.

# ఏరియా వర్క్ షాప్‌లో సిపిఆర్, అగ్నిమాపక యంత్రాల వినియోగంపై అవగాహన




ఖమ్మం, మార్చి 10:అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించే నైపుణ్యం ప్రతి ఉద్యోగికి అవసరమని, ఇటువంటి మాక్ డ్రిల్స్ ప్రాణాలను కాపాడే అవగాహనను పెంచుతాయని ఏరియా వర్క్ షాప్ డీజీఎం జే.క్రిస్టఫర్ అన్నారు. సింగరేణి సంస్థ కొత్తగూడెం ఏరియాలోని ఏరియా వర్క్ షాప్‌లో ఉద్యోగుల భద్రతను దృష్టిలో పెట్టుకుని మంగళవారం రెస్క్యూ టీం ఆధ్వర్యంలో సి.పి.ఆర్ (కార్డియో పల్మనరీ రిససిటేషన్), అగ్నిమాపక పరికరాల వినియోగంపై మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమం డివిజన్ అధికారి జే. క్రిస్టఫర్ పర్యవేక్షణలో, ఐఎన్టీయూసి ఫిట్ కార్యదర్శి ఎం.డి. సత్తార్ పాషా అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రెస్క్యూ సిబ్బంది అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలి అనే అంశంపై ఉద్యోగులకు ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. ప్రమాద సమయంలో గుండె లేదా శ్వాస ఆగిపోయిన వ్యక్తికి తక్షణం ఇవ్వాల్సిన ప్రాథమిక చికిత్స అయిన సిపిఆర్ విధానాన్ని ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. గుండె ఆగిపోయిన మొదటి కొన్ని నిమిషాలు 'గోల్డెన్ అవర్'గా పరిగణించబడుతాయని, ఆ సమయంలో సిపిఆర్ అందించడం ద్వారా ప్రాణాలు కాపాడే అవకాశాలు రెట్టింపు అవుతాయని వివరించారు. మెదడుకు రక్త ప్రసరణ కొనసాగేందుకు సిపిఆర్ ఎంతో కీలకమని తెలిపారు. నిమిషానికి 100 నుంచి 120 సార్లు ఛాతిపై ఒత్తిడి ఇవ్వడం ద్వారా గుండె పనితీరును తాత్కాలికంగా కొనసాగించవచ్చని చెప్పారు.

అలాగే అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అగ్నిమాపక యంత్రాల వినియోగంపై కూడా వివరించారు. మంటలను ఆర్పే పరికరాలు ప్రధానంగా క్లాస్ ఏ, బి, సి, డి, ఈ, ఎఫ్/కే అనే ఆరు తరగతులుగా ఉంటాయని తెలిపారు. కలప, కాగితం వంటి ఘన పదార్థాల మంటలకు నీరు లేదా ఫోమ్, పెట్రోల్ అలాగే ఆయిల్ వంటి మండే ద్రవాలకు ఫోమ్, అూ? లేదా డ్రై పౌడర్, మండే వాయువులకు డ్రై పౌడర్, లోహాల మంటలకు ప్రత్యేక డ్రై పౌడర్, విద్యుత్ కారణంగా కలిగే మంటలకు అూ? లేదా డ్రై పౌడర్, వంట నూనెల వల్ల కలిగే మంటలకు తడి రసాయన పరికరాలను ఉపయోగిస్తారని వివరించారు. ఈ పరికరాలను సరైన విధంగా వినియోగిస్తే ప్రాణ నష్టం, ఆస్తి నష్టం తగ్గించవచ్చని తెలిపారు.

ఈ కార్యక్రమంలో వర్క్ షాప్ ఇంజినీర్ టి.అనిల్, ఎంఆర్ఎస్ హెచ్ఓడీ అనంతరామయ్య, ఐఎన్టీయూసి ఫిట్ కార్యదర్శి ఎం.డి.సత్తార్ పాషా, ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి ఎం.మధు కృష్ణతో పాటు రెస్క్యూ సిబ్బంది బి.నాగేశ్వరావు, ఎం.షణ్ముఖ చారి, సూపర్‌వైజర్లు బి.వెంకట్రాం, డి.భానుచందర్, ఎం. [illegible], ఎస్.టి.యాకుబుద్దీన్, వర్క్ షాప్ ఉద్యోగులు, ట్రేడ్ అప్రెంటిస్‌లు, కార్మిక నాయకులు పాల్గొన్నారు.

# నరసింహులపేట మోడల్ స్కూల్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



మహబూబాబాద్ మార్చి 10:తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టి నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందనీ జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్ అన్నారు.మంగళవారం నరసింహులపేట మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి పిల్లలతో స్వయంగా మాట్లాడారు, 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రజలకు క్షేత్రస్థాయిలో అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు పై కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, హెల్త్, ఎడ్యుకేషన్, న్యూట్రిషన్, సానిటేషన్, ఫైళ్ళ క్లియరెన్స్, కార్యాలయాల పరిసరాల పరిశుభ్రత లపై ప్రత్యేక దృష్టి పెట్టి జిల్లా వ్యాప్తంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు, తెలంగాణ మోడల్ స్కూల్ నరసింహులపేటలో పిల్లల అందిస్తున్న సౌకర్యాలు, విద్య బోధనలపై పిల్లలతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు, ప్రభుత్వం కల్పిస్తున్న కామన్ డైట్ మెనూను పకడ్బందీగా అమలు చేయాలని, పిల్లలు ఆరోగ్యంగా ఉంటే చదువుపై దృష్టి సారించి ముందుకు వెళ్తారన్నారు, సబ్జెక్టుల వారిగా పిల్లల విద్యా సామర్థ్యాలను పరిశీలించాలని వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి ఉత్తమ విద్యా బోధనలు అందించాలని తెలిపారు,ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థుల హాజరు వివరాలను పరిశీలించారు, రానున్న పరీక్షల నేపథ్యంలో షెడ్యూలు ప్రకారం ఏర్పాట్లు చేయాలని, సంబంధిత సిబ్బందికి సూచించారు.

జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి దేశీ రామ్ నాయక్, గిరిజన ఆశ్రమ పాఠశాల మహబూబాబాద్, ఆశ్రమ హై స్కూల్, మహాత్మ జ్యోతిరావు పూలే స్కూల్ దంతాలపల్లి, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, కురవి ఐకెపి సెంటర్ లో క్లీనింగ్ అండ్ సానిటేషన్ పనులు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించారు, జిల్లా పశు వైద్య అధికారి డాక్టర్ కిరణ్ కుమార్, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ జూనియర్ కాలేజ్, మరిపెడ, జిల్లా హార్టికల్చర్ అధికారి జి.మరియాన్న నెల్లికుదురు మండలం కస్తూరిబా గాంధీ విద్యాలయం, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీనివాసరావు, గూడూరు మండలం దామారవంచ, తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు, మహబూబాబాద్ పట్టణంలోని మైనారిటీ రెసిడెన్షియల్ హై స్కూల్, ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భీమ్లా నాయక్, ఎస్సీ ఎస్టీ హాస్టల్ చిన్న గూడూరు,జిల్లా పరిషత్ సీఈవో పురుషోత్తం, మరిపెడ ఎంపీడీవో కార్యాలయం తనిఖీ చేసి సానిటేషన్, ఫైల్ క్లియరెన్స్ చేయించారు, సివిల్ సప్లై డిఎం ఎస్సీ హాస్టల్ ఇనుగుర్తి, వెల్ఫేర్ అధికారిని సబిత ఆశ్రమ హై స్కూల్ కురవి, ప్రాజెక్ట్ డైరెక్టర్ మెప్మా విజయ ఆశ్రమ హైస్కూల్ మహబూబాబాద్, అగ్రికల్చర్ అధికారి, తదితరులు వారికి కేటాయించిన వసతి గృహాలలో తనిఖీ చేసి నివేదికలు అందించారు.

# అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరును జాబితా నుంచి తొలగించం : సీఈసీ జ్ఞానేశ్ కుమార్

న్యూఢిల్లీ, మార్చి 10:అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరును కూడా ఓటర్ జాబితా నుంచి తొలగించబోమని కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల నిమిత్తం సీఈసీ బృందం పశ్చిమ బెంగాల్‌లో పర్యటించింది. ఈ క్రమంలో రాజకీయ పార్టీలు, అధికారులతో సమావేశాల అనంతరం జ్ఞానేశ్‌కుమార్ విలేకరులతో మాట్లాడారు.

పశ్చిమబెంగాల్‌లో స్వేచ్ఛగా, ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చూడటమే ఎన్నికల సంఘం మొదటి ప్రాధాన్యమని ఆయన చెప్పారు. అర్హత ఉన్న ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును ఉపయోగించుకునే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా అర్హత కలిగిన ఓటర్ల పేర్లు ఎప్పటికీ తొలగించబోమని స్పష్టం చేశారు. రాజ్యాంగంలోని నిబంధనల ప్రకారమే అన్ని రాష్ట్రాల్లో 'ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)' అమలవుతుందని అన్నారు.

ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా చూడటం, అర్హులైన వారి పేర్లు ఆ జాబితాలో ఉండేలా చూడటమే 'సర్' బాధ్యత అని చెప్పారు. ఇక్కడ ఎన్నికలు ఎన్ని దశల్లో జరుగుతాయనేది రాష్ట్రప్రభుత్వం శాంతిభద్రతల విషయంలో చేపట్టే చర్యలపైన ఆధారపడి ఉంటుందన్నారు. బెంగాల్ ఎన్నికల ప్రక్రియలో ప్రభుత్వ ఉద్యోగులందరూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు విధులు నిర్వర్తించాలని చెప్పారు.

ఓటర్లపైనా, ఎన్నికల అధికారులపైనా రాజకీయ నేతలు ఎలాంటి బెదిరింపులకు పాల్పడినా సహించేది లేదని అన్నారు. పశ్చిమబెంగాల్‌లో దాదాపు 80 వేల పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, వాటిల్లో దాదాపు 61 వేలు గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నాయని చెప్పారు. ఓటింగ్ ప్రక్రియలో పారదర్శకతను పెంపొందించేందుకు రాష్ట్రంలోని అన్ని పోలింగ్ బూత్‌లలో ఎలాంటి అవకతవకలు జరగకుండా వెబ్‌కాస్టింగ్ ప్రక్రియను అమలుచేయనున్నట్లు తెలిపారు.

# కూనో నేషనల్ పార్కులో అయిదు కూనలకు జన్మనిచ్చిన 'జ్వాల'..

న్యూఢిల్లీ, మార్చి 10:నమీబియా నుంచి రప్పించిన చీతా 'జ్వాల' మధ్యప్రదేశ్‌లోని కూనో అభయారణ్యంలో అయిదు కూనలకు జన్మనిచ్చిందనీ, ఇది 'జ్వాల' విజయవంతంగా మూడో సారి తల్లి అయిన సందర్భమనీ కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి శ్రీ భూపేందర్ యాదవ్ సోమవారం ప్రకటించారు.

సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో మంత్రి ఒక సందేశాన్ని పొందుపరుస్తూ, ప్రస్తుతం భారత్‌లో పుట్టి పెరుగుతున్న చిరుతల కూనల సంఖ్య 33కు పెరిగినట్లు పేర్కొన్నారు. భారత్ గడ్డ మీద ఇప్పటి వరకు 10 చిరుత కూనలు పుట్టాయనీ, ఇది భారత్ చిరుతల సంరక్షణ ప్రస్థానంలో కీలక పురోగతిని సూచిస్తోందనీ ఆయన తెలిపారు.

'ప్రాజెక్ట్ చీతా'లో ఇది ఓ గర్వకారణ ఘట్టమని శ్రీ యాదవ్ వర్ణించారు. పశువైద్యులు, క్షేత్ర ఉద్యోగులతో పాటు అవిశ్రాంతంగా పనిచేస్తున్న ఇతర సిబ్బంది ఎంతో అంకిత భావంతో చేస్తున్న కృషికీ, వారి నేర్పరితనానికీ, నిబద్ధతకీ ఇది అద్దం పడుతోందని ఆయన అన్నారు. ఈ కూనలతో, భారత్‌లో మొత్తం చిరుతల సంతతి 53కు చేరుకొందని మంత్రి వివరించారు.

వన్యప్రాణి సంరక్షణలో ఇది చరిత్రాత్మక క్షణమే కాక ఆనంద దాయక క్షణం కూడా అని మంత్రి వర్ణించారు. తల్లి చిరుతతో పాటు కూనలు కూడా ఆరోగ్యంగా ఉన్నాయనీ, సంతతిని వృద్ధి చేసుకుంటాయనీ, భారత్ చిరుత గాథలో మరిన్ని విజయాలకు బాట వేయగలవన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

దక్షిణాఫ్రికా చిరుత 'గామిని' ఇటీవల రెండోసారి కాన్పులో నాలుగు కూనలకు జన్మనిచ్చింది. 2026 ఫిబ్రవరి 28న, బోట్స్వానా నుంచి అందుకున్న తొమ్మిది చిరుతలను కూనో నేషనల్ పార్కులో కంచెలున్న ఆవరణాల్లోకి విడిచిపెట్టారు. వాటిలో ఆడ చిరుతలు 6, మగ చిరుతలు 3 ఉన్నాయి. అవి మారిన పరిస్థితులకు మెల్ల మెల్లగా అలవాటు పడుతున్నాయి. వాటి స్వస్థతను పర్యవేక్షించే దశ సమాప్తమైన తరువాత క్రమంగా ప్రాకృతిక వాతావరణంలోకి వదలిపెడతారు.

# గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

నల్గొండ, మార్చి 10: మండల పరిధిలోని కండ్లకుంట గ్రామం వద్ద గల గుంటూరు బ్రాంచ్ కెనాల్‌పై గల కేసీపి 4వ నెంబర్ పవర్ ప్లాంట్ వద్ద సుమారు 30 నుంచి 35 ఏళ్ల వయస్సు కలిగిన గుర్తుతెలియని మగ వ్యక్తి శవం కొట్టుకురాగా సమాచారం అందుకున్న నకరికల్లు ఎస్ఐ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించి పంచనామా నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.మృతుడు లైట్ గ్రీన్ కలర్ షార్ట్ సిమెంట్ కలర్ టీషర్ట్ ధరించి ఉన్నాడని ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని గుర్తించిన వారు 9440796246 లేదా 9966460427 నెంబర్లను సంప్రదించాలని ఎస్సై సతీష్ కోరారు కోరారు.

# యూనియన్ బ్యాంక్ ద్వారా రూ. కోటి ప్రమాద బీమా చెక్కు అందజేత




వరంగల్, మార్చి 10:యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ప్రమాద బీమా పథకం కింద రూ. కోటి బీమా చెక్కును లబ్ధిదారికి అందజేశారు. మంగళవారం వరంగల్ ప్రాంతీయ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగి ఉప్పల రవి ఇటీవల ప్రమాదంలో మృతి చెందాడు. కాగా, అతడి భార్య పుప్పల లత భవానీకి హైదరాబాద్ జోనల్ ఆఫీస్ జనరల్ మేనేజర్ కామేశ్వరరావు టీజీఎస్ రూ.కోట్ల ప్రమాద బీమా క్లెయిమ్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ జోన్ తెలంగాణ రాష్ట్రాన్ని మొత్తం 698 బ్రాంచీలతో సేవలు అందిస్తోందన్నారు.

రిటైల్, వ్యవసాయ, ఎంఎస్ఎంఈ, పెద్ద కార్పొరేట్ రంగాలకు సేవలు అందిస్తూ సుమారు రూ.2 లక్షల కోట్ల వ్యాపారాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.తెలంగాణ వార్తలు

ప్రభుత్వ ఉద్యోగుల జీత ఖాతాదారులకు బ్యాంక్ ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నదన్నారు. ఇందులో భాగంగా రూ.1.00 కోట్ల వ్యక్తిగత ప్రమాద బీమా కవరేజీ, రూపే డెబిట్ కార్డు ద్వారా అదనంగా రూ.4 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు బీమా రక్షణ, రూపే కార్డు ద్వారా రూ.1.00 కోట్ల ఎయిర్ యాక్సిడెంటల్ కవరేజీ, రిటైల్ రుణాలపై రాయితీ వడ్డీ రేట్లు, లాకర్ అద్దెలపై రాయితీలు వంటి అనేక ప్రయోజనాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు అందిస్తున్నట్లు చెప్పారు.

టీజీఎస్ ఆర్టీసీతో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు జీతాల ఒప్పందం ఉన్నదని, సుమారు 33 వేల మంది ఆర్టీసీ ఉద్యోగులు తమ జీత ఖాతాలను యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ జీతాల ఒప్పందం కింద ఆర్టీసీ ఉద్యోగులకు రూ.1.00 కోట్ల ప్రమాద బీమా కవరేజీ అందించబడుతుందని, అదే పథకం కింద పుప్పల లత భవానీకి బీమా చెక్కు అందజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వరంగల్ రీజియన్ డీజీఎం, రీజినల్ హెడ్ కమలాకర్ గంటి, టీజీఎస్ ఆర్టీసీ వరంగల్ ఆర్ఎం విజయ్ భాను, పరకాల డిపో మేనేజర్ రామ్ ప్రసాద్, ఖాతాదారు అధికారి రవీందర్, టీజీఎస్ ఆర్టీసీ అధికారులు సైదులు, పీ శ్రీరామ్, ఎం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్య ద్వారానే మహిళల అభ్యున్నతి సాధ్యం : కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి



హనుమకొండ మార్చి 10 : విద్య ద్వారానే మహిళల అభ్యున్నతి సాధ్యమని కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయం నిర్వహించిన సావిత్రిబాయి ఫులే 129వ వర్ధంతి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా దూరవిద్య ప్రాంగణంలోని ఫులే దంపతుల విగ్రహాల వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ సావిత్రిబాయి ఫులే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

అనంతరం విద్యార్థులు, ఉద్యోగులతో మాట్లాడుతూ నేటి మహిళా విద్యకు సావిత్రిబాయి ఫులే చేసిన సేవలు అమూల్యమని, ఆమె కృషి ఫలితంగానే మహిళా విద్యకు బాటలు పడినట్లు తెలిపారు. భారతదేశంలో సగభాగమైన మహిళలు విద్యావంతులు అయినప్పుడు దేశం అన్ని రంగాల్లో ముందుకు సాగుతుందన్నారు. గౌరవ అతిథిగా హాజరైన రిజిస్ట్రార్ ఆచార్య వల్లూరి రామచంద్రం మాట్లాడుతూ అసమానతలు, వివక్షలను ఎదుర్కొన్నప్పటికీ తన లక్ష్యాన్ని విడిచిపెట్టని మహనీయురాలు సావిత్రిబాయి ఫులే అని అన్నారు.

# ఈ నెల 16 నుండి సిపిఎం నిరవధిక నిరహార దీక్షలు

## - రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిని వంద పడకలుగా మార్చాలని డిమాండ్

నల్గొండ, మార్చి 10:రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా మార్చి రాబోయే రాష్ట్ర బడ్జెట్‌లో రూ.40 కోట్లు కేటాయించి నూతన భవనం నిర్మించాలని సిపిఎం ఆధ్వర్యంలో ఈ నెల 16 నుండి జరిగే నిరవధిక నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని రైతు సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జల్లెల పెంటయ్య పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక రావనపేట రహదారి బంగ్లాలో నిరాహార దీక్షల కరపత్రాన్ని అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 60 ఏండ్ల క్రితం ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఆస్పత్రి పరిసర గ్రామాల ప్రజలకు వైద్య సౌకర్యాలు అందిస్తూ నేడు సమస్యల వలయంలో ఉందన్నారు. పేదల కు నాణ్యమైన వైద్య సేవలు అందకపోవడంతో సుదూర ప్రాంతా లకు వెళ్లి ప్రైవేట్ ఆసుపత్రులని ఆశ్రయించాల్సి వస్తుందని తెలిపారు.

రోజుకు 400 మంది అవుట్ పేషెంట్లు వస్తున్నా కనీసం రోగులకు తగ్గ డాక్టర్లు లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అనేకసార్లు ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ యంత్రాంగం, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, ప్రజలు అనేక దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నా పాలకులు చొరవ చూపడం లేదన్నారు. ఎన్నికలప్పుడే ప్రజలకు మాయ మాటలు చెప్పి మభ్య పెట్టడం తప్ప అడుగు ముందుకు పడడం లేదన్నారు. ఏరియా ఆస్పత్రి బోర్డు పెట్టి 15 సంవత్స రాలు గడుస్తున్నా ఇప్పటికీ 30 పడకలకే పరిమితమైందని తెలిపారు. వెంటనే బడ్జెట్ సమావేశాల్లో వంద పడకల ఆస్పత్రికి ప్రత్యేక నిధులు కేటాయించాలని లేని పక్షంలో మండల వ్యాప్త ప్రజలను సమీకరించి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, టీడీపీ మండల నాయకుడు ఫజల్ బేగ్, సిపిఐ మండల నాయకులు రచ్చ యాదగిరి, ఎంఆర్పిఎస్ మండల అధ్యక్షుడు నోముల చిరంజీవి, సిపిఎం జిల్లా కమిటి సభ్యుడు వనం ఉపేందర్, మండల కార్యదర్శి వర్గ సభ్యులు బోయిని ఆనంద్, కందుల హనుమతు, మండల కమిటి సభ్యులు గొరిగె సోములు, గన్నెబోయిన విజయ భాస్కర్, ఎండీ రషీద్, బావండ్లపల్లి బాలరాజు, బోడిగె రజిత, పట్టణ శాఖ కార్యదర్శి మునికుంట్ల లెనిన్, రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటి సభ్యుడు ఆవనగంటి స్వామి, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు గంటెపాక శివ కుమార్, దుబ్బాక సర్పంచ్ గట్టు నర్సింహా, పల్లె సత్యం, మేడి గణేష్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పుట్టల ఉదయ్, డివైఎఫ్ఐ మండల అధ్యక్షుడు శానగొండ రామచంద్రం, రమేశ్ పాల్గొన్నారు.

# ఆత్మవిశ్వాసం, సమయ పాలనతో బోర్డు పరీక్షల్లో విజయం

ప్రతి విద్యార్థి విద్యా ప్రయాణంలో పదవ తరగతి బోర్డు పరీక్షలు అత్యంత కీలకమైన దశగా భావించ బడతాయి. విద్యార్థి భవిష్యత్ విద్యా దిశను నిర్దేశించే ఈ పరీక్షలు కేవలం మార్కుల పోటీ మాత్రమే కాకుండా క్రమశిక్షణ, సమయ పాలన, మానసిక స్థైర్యం, శ్రద్ధ వంటి విలువలను కూడా పరీక్షిస్తాయి. ఈ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలంటే కేవలం చదువు మాత్రమే సరిపోదు. చదువు విధానం, సమయ నిర్వహణ, ప్రశ్నలకు సమాధానాలు రాయడంలో సరైన పద్ధతి, పరీక్ష అనంతరం సమాధానాలను పరిశీలించుకునే అలవాటు వంటి అంశాలు కూడా సమానంగా అవసరం.



పరీక్షల సమయంలో చాలా మంది విద్యార్థులు ఆందోళన, భయం, ఒత్తిడి వంటి భావోద్వేగాలకు లోనవుతుంటారు. అయితే పరీక్షలను భయపడాల్సిన అవసరం లేదు. సరైన ప్రణాళికతో, క్రమబద్ధమైన చదువుతో, సమయపాలనతో ముందుకు సాగితే పరీక్షలు సులభంగా ఎదుర్కోవచ్చు. విద్యార్థులు ముందుగా పరీక్షలను ఒక బాధ్యతగా కాకుండా ఒక అవకాశంగా చూడాలి. తమ సామర్థ్యాన్ని నిరూపించుకునే వేదికగా భావిస్తే భయం తగ్గి ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.

పరీక్షలకు ముందు పునశ్చరణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలి. పాఠ్యాంశాన్ని మొదటిసారి చదవడం ఒక దశ అయితే, దాన్ని మళ్లీ మళ్లీ పునశ్చరణ చేయడం ద్వారానే అది మనసులో స్థిరపడుతుంది. ముఖ్యమైన సూత్రాలు, నిర్వచనాలు, గణిత సమీకరణాలు, తేదీలు, చారిత్రక సంఘటనలు వంటి అంశాలను చిన్న నోట్ల రూపంలో రాసుకొని తరచుగా చదవడం చాలా ఉపయోగకరం. దీనివల్ల పరీక్షల సమయంలో త్వరగా గుర్తు చేసుకునే అవకాశం ఉంటుంది.

పరీక్షల సమయంలో సమయ నిర్వహణ అత్యంత కీలకమైన అంశం. ప్రశ్నాపత్రం చేతికి వచ్చిన వెంటనే తొందరపడి రాయడం ప్రారంభించకుండా మొదట కొన్ని నిమిషాలు తీసుకొని మొత్తం ప్రశ్నా పత్రాన్ని పూర్తిగా చదవాలి. అందులోని ప్రశ్నల స్వభావం, మార్కుల విభజన, ఎంపిక ప్రశ్నలు వంటి అంశాలను అర్థం చేసుకోవాలి. తదనంతరం ఏ ప్రశ్నకు ఎంత సమయం కేటాయించాలో ముందుగానే నిర్ణయించు కోవాలి. సాధారణంగా ఎక్కువ మార్కులున్న ప్రశ్నలకు కొంత ఎక్కువ సమయం కేటాయించాలి. అయితే ఒక్క ప్రశ్నపైనే ఎక్కువ సమయం ఖర్చు చేయకుండా సమతౌల్యం పాటించడం అవసరం.

విద్యార్థులు ముందుగా బాగా తెలిసిన ప్రశ్నలతో సమాధానాలు రాయడం ప్రారంభిస్తే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. మొదటి కొన్ని సమాధానాలు సులభంగా రాయగలిగితే మిగిలిన ప్రశ్నలకు సమాధానాలు రాయడంలో కూడా ఉత్సాహం పెరుగుతుంది. తెలియని ప్రశ్నలపై ఎక్కువగా ఆలోచిస్తూ సమయాన్ని వృథా చేయకుండా, తాత్కాలికంగా వదిలి తరువాత ప్రయత్నించడం ఉత్తమం.

సమాధానాలను రాయడంలో స్పష్టత, క్రమబద్ధత, సరళత ఎంతో ముఖ్యమైనవి. పరీక్షా పత్రాన్ని మూల్యాంకనం చేసే ఉపాధ్యాయులు సమాధానాలను సులభంగా అర్థం చేసుకునే విధంగా రాయాలి. అర్థం కాని రీతిలో పొడవుగా రాయడం కన్నా సూటిగా, స్పష్టంగా, పాయింట్ల రూపంలో రాయడం ఉత్తమం. ముఖ్యమైన పదాలను అండర్లైన్ చేయడం, ఉపశీర్షికలుగా విభజించడం, అవసరమైన చోట చార్టులు లేదా చిత్రాలు గీయడం ద్వారా సమాధానాన్ని మరింత స్పష్టంగా చేయవచ్చు.

అక్షరాల స్పష్టత కూడా మంచి మార్కులు పొందడంలో కీలక పాత్ర పోషిస్తుంది. కొంతమంది విద్యార్థులు త్వరగా రాయాలనే ఆలోచనతో అక్షరాలను గందరగోళంగా రాస్తారు. దీనివల్ల పరీక్షా పత్రాన్ని చదవడం మూల్యాంకనాధికారులకు కష్టమవుతుంది. అందువల్ల వేగం మరియు స్పష్టత మధ్య సమతౌల్యం పాటించాలి. ప్రతి పదం చదవడానికి సులభంగా ఉండేలా రాయడం మంచిది.

గణిత శాస్త్రం మరియు విజ్ఞాన శాస్త్రాల వంటి విషయాల్లో ప్రతి దశను స్పష్టంగా చూపించడం చాలా ముఖ్యమైనది. కేవలం తుది సమాధానం రాయడం మాత్రమే సరిపోదు. సమస్యను పరిష్కరించే ప్రతి దశను క్రమపద్ధతిలో చూపిస్తే పూర్తి మార్కులు పొందే అవకాశం ఉంటుంది. అదే విధంగా విజ్ఞాన శాస్త్రంలో అవసరమైన చిత్రాలు, లేబుల్స్ సరిగా గీయడం కూడా మంచి మార్కులకు దోహదపడుతుంది.

సమాధాన పత్రంలో తప్పులను తగ్గించడానికి విద్యార్థులు చివరి కొన్ని నిమిషాలను తప్పనిసరిగా సరి చూసుకోవడానికి కేటాయించాలి. తొందరలో రాసినప్పుడు కొన్ని చిన్న తప్పులు జరగడం సహజం. సంఖ్యలలో పొరపాట్లు, పదాల తప్పులు, ప్రశ్న నంబర్లలో గందరగోళం వంటి లోపాలు ఉండే అవకాశం ఉంటుంది. పరీక్ష సమయం ముగిసే ముందు సమాధాన పత్రాన్ని పూర్తిగా పరిశీలిస్తే ఈ తప్పులను సరిచేసుకునే అవకాశం ఉంటుంది.

పరీక్షల సమయంలో మానసిక ప్రశాంతత కూడా అత్యంత అవసరం. ఒత్తిడిని తగ్గించడానికి విద్యార్థులు సరైన నిద్ర, సమతుల్య ఆహారం తీసుకోవాలి. రాత్రి పొద్దుపోయే వరకు చదివి అలసటకు గురికావడం కన్నా, క్రమబద్ధమైన విశ్రాంతి తీసుకోవడం ఉత్తమం. ఆరోగ్యకరమైన శరీరంలోనే చురుకైన మనస్సు ఉంటుంది అనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.

పరీక్షల ముందు రోజు కొత్త పాఠాలను చదవడం కన్నా ఇప్పటికే చదివిన విషయాలను పునశ్చరణ చేయడం మంచిది. కొత్త విషయాలను చదవడం వల్ల గందరగోళం పెరిగే అవకాశం ఉంటుంది. అందువల్ల ఇప్పటికే నేర్చుకున్న అంశాలను మళ్లీ ఒకసారి గుర్తు చేసుకోవడం ద్వారా ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.

పరీక్షా కేంద్రానికి సమయానికి ముందుగానే చేరుకోవడం కూడా చాలా ముఖ్యమైన అంశం. ఆలస్యంగా రావడం వల్ల తొందర, ఆందోళన పెరుగుతుంది. పరీక్ష ప్రారంభానికి కనీసం అరగంట ముందే కేంద్రానికి చేరుకుంటే మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. అవసరమైన హాల్ టికెట్, పెన్నులు, పెన్సిళ్లు, గణక యంత్రం (అనుమతి ఉన్నపక్షంలో) వంటి వస్తువులను ముందుగానే సిద్ధం చేసుకోవాలి.

ఇతర విద్యార్థులతో పోల్చుకోవడం కూడా అనవసరమైన ఒత్తిడిని పెంచుతుంది. ప్రతి విద్యార్థికి తనకు తానుగా చదివే విధానం ఉంటుంది. ఇతరులు ఎంత చదివారనే విషయంపై ఆలోచించకుండా తాము ఎంత సమర్థంగా సిద్ధమయ్యామనే విషయంపై దృష్టి పెట్టాలి. ఆత్మవిశ్వాసం, పట్టుదల ఉంటే ఏ పరీక్షనైనా విజయవంతంగా ఎదుర్కోవచ్చు.

తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయుల పాత్ర కూడా ఇక్కడ ముఖ్యమైనది. వారు విద్యార్థులపై అనవసర ఒత్తిడి లేకుండా ప్రోత్సహించాలి. విద్యార్థుల్లో నమ్మకం పెంచే విధంగా మాట్లాడాలి. పరీక్షలు జీవితంలో ఒక దశ మాత్రమే కానీ అంతిమ గమ్యం కాదని వారికి తెలియజేయాలి.

మొత్తానికి పదవ తరగతి బోర్డు పరీక్షలు విద్యార్థి జీవితంలో ఒక ముఖ్యమైన మైలురాయి. సరైన ప్రణాళిక, సమయపాలన, పునశ్చరణ, సమాధానాల స్పష్టత, మానసిక ప్రశాంతత వంటి అంశాలను పాటిస్తే మంచి ఫలితాలు సాధించడం కష్టం కాదు. క్రమశిక్షణతో చదివి, ఆత్మవిశ్వాసంతో పరీక్షలను ఎదుర్కొంటే విజయ ద్వారం విద్యార్థుల ముందు తప్పకుండా తెరుచు కుంటుంది. ఈ దశలో సాధించిన విజయమే వారి భవిష్యత్ విద్యా ప్రయాణానికి బలమైన పునాది అవుతుంది.



-రామ కిష్టయ్య సంగన భట్ల,
9440595494

# బీఆర్ఎస్‌లో నాగుల రాముగౌడ్ చేరిక



రాజన్న సిరిసిల్ల, మార్చి 10: నేటినిజం (ప్రతినిధి): వేములవాడ పట్టణానికి చెందిన నాగుల రాములు గౌడ్‌కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి, వేములవాడ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ చల్మెడ లక్ష్మీ నరసింహారావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా నాగుల రాముగౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, కానీ మూడున్నర సంవత్సరాలు గడిచినా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. అభివృద్ధి బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమని నమ్మి పార్టీలో చేరినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో మళ్లీ అధికారంలోకి వచ్చే పార్టీ బీఆర్ఎస్‌నే అని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# నాంపల్లి గౌడ సంగం ఆధ్వర్యంలో ఎల్లమ్మ సిద్దోగాం జాతర మహోత్సవం

**అంబేద్కర్ యువజన సంఘం వారి ఆధ్వర్యంలో పోచమ్మ బోనాల పండగ వేడుకలు**

**వేడుకల్లో పాల్గొన్న 5వ వార్డ్ కౌన్సలర్ వాసాల లావణ్య డాక్టర్ శ్రీనివాస్**



రాజన్న సిరిసిల్ల, మార్చి 10: నేటినిజం (ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండలం నాంపల్లి మున్సిపల్ 5 వ వార్డు నాంపల్లి గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ సిద్దోగాం జాతర మహోత్సవం వేడుకలు అంబేద్కర్ యువజన సంఘం వారి ఆధ్వర్యంలో పోచమ్మ బోనాల పండగ ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా 5వ వార్డ్ కౌన్సలర్ వాసాల లావణ్య శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘ సభ్యులు, గౌడ సంఘ నేతలు, మహిళలు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# బీసీ సాధికారిత సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు



రాజన్న సిరిసిల్ల, మార్చి 10: నేటినిజం (ప్రతినిధి): బీసీ సాధికారిత సంఘం ఆధ్వర్యంలో వేములవాడ సంఘ కార్యాలయంలో 115వ అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కటింగ్ చేసి, సీట్ల పంపిణీ చేసి మహిళా సోదరీమణులను సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొండ దేవయ్య పటేల్ మాట్లాడుతూ మహిళా శక్తి సమాజ ప్రగతికి మూలాధారమని తెలిపారు. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. మహిళలు రాజకీయ, ఆర్థిక, సామాజిక, విద్యా, ఉపాధి, ఉద్యోగ, క్రీడా రంగాల్లో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మహిళా సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా భావించి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో అధిక నిధులు కేటా యించాలని ఆయన కోరారు. మహాత్మా గాంధీ చెప్పినట్లు మహిళలు అర్ధరాత్రి ఒంటరిగా భయపడకుండా తిరగగలిగి నప్పుడే నిజమైన స్వాతంత్ర్యం సిద్ధించినట్లవుతుందని పేర్కొం టూ, మహిళల్లో ధైర్యసాహసాలు పెంపొందించే విధంగా ప్రభుత్వా లు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉత్తర తెలంగాణ జిల్లాల ఇంచార్జీ పొలాస నరేందర్ మాట్లాడుతూ సమాజంలో సగభాగమైన మహిళలు అన్ని రంగాల్లో అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ల బిల్లు త్వరగా అమల్లోకి తేవాలని ప్రభుత్వాలను కోరారు. మహిళల అభివృద్ధికి నాణ్యమైన విద్య, సాంకేతిక నైపుణ్యాలు, ప్రభుత్వ సహకారం అవసరమని తెలిపారు. ఈ సందర్భంగా భారతదేశ తొలి మహిళా ఉపాధ్యా యురాలు, ప్రముఖ సంఘసేవకురాలు క్రాంతిజ్యోతి సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మహిళా హక్కుల కోసం ఆమె చేసిన సేవలను నాయకులు స్మరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సాధికారిత సంఘం నాయకులు మాజీ కౌన్సిలర్ జిల్లా అధికార ప్రతినిధి మారం కుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఇల్లందుల వెంకటేష్, జిల్లా మహిళా అధ్యక్షురాలు గాదె శ్రావంతి, జిల్లా ప్రధాన కార్యదర్శి మెరుగు జల, బాలక్ష్మి, కళ్యాణి, జ్యోతి, శ్రీనిధి, బాబాయి, జిల్లా కార్యదర్శి చింతల కోటి రామస్వామి గౌడ్, బీసీ నేతలు కనపర్తి సుధాకర్, కొణతాల తిరుపతి, తూమ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చొరవ

## -ఈద్గా వద్ద సీసీ రోడ్డు నిర్మాణం



# కాటమయ్య సేఫ్టీ మోకుల పంపిణీ కార్యక్రమం



రాజన్న సిరిసిల్ల, మార్చి 10: నేటినిజం (ప్రతినిధి): చందుర్తి మండలం నర్సింగాపూర్ గౌడ సంఘం సభ్యులకు కాటమయ్య సేఫ్టీ మోకుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం సర్దార్ సర్వాయ పాపన్న గీతా కార్మిక సంఘం స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ సంపునూరి మల్లేశం గౌడ్, రాజన్న సిరిసిల్ల జిల్లా గౌడ సంక్షేమ సంఘం సలహాదారు ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా గౌడ సంక్షేమ సంఘం కార్యనిర్వాహక సభ్యులు బైరగోని రమేష్ గౌడ్, నర్సింగాపూర్ సర్పంచ్ మరాటి మల్లిక్, ఎక్సైజ్ సీఐ రాజశేఖర్ రావు, ఎస్సై రవి పాల్గొన్నారు. నర్సింగాపూర్, మూడపల్లి, అనంతపల్లె గ్రామాల గీతా కార్మికుల సహకార సంఘ సభ్యులకు ముందుగా శిక్షణ ఇచ్చి అనంతరం సేఫ్టీ మోకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పెద్దలు మాట్లాడుతూ గీతా కార్మికులు తమ వృత్తిలో ప్రమాదాలకు గురికాకుండా ఉండేందుకు గత పది సంవత్సరాలుగా ప్రభుత్వ కార్యదర్శి బుర్ర వెంకటేశం గౌడ్, ఎక్సైజ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ చేసిన కృషి ఎంతో గొప్పదని కొనియాడారు. అలాగే ప్రభుత్వం గీతా కార్మికులకు బకాయి ఉన్న ఎక్స్‌గ్రేషియా నిధులను విడుదల చేసి వారిని ఆదుకోవాలని, గీతా కార్మికులకు ఇచ్చిన హామీలను త్వరగా నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ రాజశేఖర్ రావు, ఎస్సై రవి, జిల్లా గౌడ సంక్షేమ సంఘం సలహాదారు సంపునూరి మల్లేశం గౌడ్, కార్యనిర్వాహక సభ్యులు బైరగోని రమేష్ గౌడ్, సర్పంచ్ మరాటి మల్లిక్, ట్రైనర్స్ తోడేటి జితేందర్ గౌడ్, కాటా రవీందర్ గౌడ్, గుర్రం శ్రీనివాస్ గౌడ్, మాజీ గౌడ సంఘం అధ్యక్షులు సంపనూరి మురళి గౌడ్, మెరుపుల రాజేశం గౌడ్, గుర్రం దేవగౌడ్, వంగ లచ్చయ్య, దేవయ్య, మల్లేశం, సాగర్, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడలో హెచ్‌పీవీ వ్యాక్సినేషన్‌పై అవగాహన



రాజన్న సిరిసిల్ల, మార్చి 10: నేటినిజం (ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వేములవాడ పట్టణంలోని సుభాష నగర్ రజక సంఘం కార్యాలయం వద్ద హెచ్‌పీవీ వ్యాక్సినేషన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మెడికల్ ఆఫీసర్ డా. దివ్యశ్రీ, ప్రోగ్రాం ఆఫీసర్ డా. నయీమ్ జహాన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 14 సంవత్సరాల బాలికలు ( 26-02-2011 నుండి 25-02-2012 మధ్య) జన్మించిన బాలికలు తప్పనిసరిగా హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. మహిళల్లో వచ్చే గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ నివారణకు ఈ వ్యాక్సిన్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఈ అవకాశాన్ని అర్హులైన బాలికలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఇప్పపూల అజయ్ మమత, శ్రీనివాస్, రజక సంఘం మాజీ రాష్ట్ర కన్వీనర్ మైలారం రాము, రజక సంఘం అధ్యక్షులు చి. బాలయ్య, చి. దేవయ్య, రజక సంఘం సభ్యులు, మహిళలు, మెడికల్ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళాభివృద్ధితోనే దేశాభివృద్ధి




హైదరాబాద్, మార్చి 10:మహిళాభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని హెరిటేజ్ ఫుడ్స్ వైస్ ఛైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ నారా భువనేశ్వరి తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణాలోని షాద్‌నగర్ దగ్గర నందిగామ గ్రామంలో మహిళా పాడి రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గడిచిన 33 ఏళ్లుగా హెరిటేజ్ ఫుడ్స్ రైతులతో ఒక కుటుంబంగా ప్రయాణం చేస్తుందన్నారు. ఈ ప్రయాణంలో మహిళలే కేంద్ర బిందువు అన్నారు. మా పాల సేకరణ కేంద్రాలలో 42 శాతం మహిళల ద్వారానే నడుస్తున్నాయన్నారు. మా రైతు భాగస్వాములలో దాదాపు 45 శాతం మంది మహిళలే ఉన్నారన్నారు. ఇవి కేవలం అంకెలు మాత్రమే కాదన్నారు. ఒక మహిళ ఆర్థికంగా బలోపేతమైనప్పుడు ఆమె కుటుంబం, ఆమె గ్రామం, దేశం కూడా బలోపేతం అవుతుందన్నారు. మహిళా రైతులు అందించే ప్రతి లీటరు పాలు వారి కష్టానికి, ఆత్మ గౌరవానికి, వారి కుటుంబాల కోసం వారు నిర్మిస్తున్న భవిష్యత్తుకు చిహ్నం అన్నారు. హెరిటేజ్ వారి కష్టానికి తగిన గుర్తింపు లభించేలా చూడటం, చెల్లింపులు పారదర్శకంగా, సమయానికి అందేలా చేయడం, నాయకత్వం నిరంతరం వృద్ధి చెందేలా చూడటమే మా లక్ష్యమన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం భారతదేశపు అగ్రగామి డైరీ కంపెనీలలో ఒకటైన హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించింది. మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, ఒడిశా, ఉత్తరప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్ వంటి 9 రాష్ట్రాల్లోని 189 చిల్లింగ్ సెంటర్లలో భారీ ఎత్తున ఈ వేడుకలు జరిగాయి. డైరీ సరఫరా వ్యవస్థలో అట్టడుగు స్థాయి నుంచి మహిళా సాధికారత పట్ల తమకున్న నిబద్ధతను ఈ సందర్భంగా సంస్థ పునరుద్ఘాటించింది. హెరిటేజ్ ఫుడ్స్ సేకరణ నెట్‌వర్క్‌కు మహిళలే వెన్నెముక. కంపెనీకి ఉన్న మొత్తం 4,600 హెరిటేజ్ ప్రొక్యూర్‌మెంట్ సెంటర్లలో, 2,000 పైగా (సుమారు 42 శాతం) కేంద్రాలు మహిళల ద్వారానే నిర్వహించబడుతున్నాయి. దేశవ్యాప్తంగా హెరిటేజ్‌తో భాగస్వామ్యం కలిగి ఉన్న మూడు లక్షల మంది రైతులలో దాదాపు 45 శాతం మంది మహిళలే ఉండటం విశేషం.

మహిళల అద్భుతమైన భాగస్వామ్యం, నాయకత్వాన్ని గౌరవిస్తూ, వారి కృషికి తగినట్లుగా ఈ ఏడాది అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను హెరిటేజ్ ఫుడ్స్ నిర్వహించింది. ఆయా యూనిట్ మేనేజర్లు ఈ కార్యక్రమాలకు ఆతిథ్యం ఇచ్చి, మహిళా ప్రతినిధులను ఘనంగా సత్కరించారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com